ప్రజాశక్తి

ఆదివారం 14 ఏప్రిల్ 2024 8 పేజీలు





శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

వేమిరెడ్డి X వేణుంబాక..!



ఓటర్లతో మాట్లాడుతున్న వేమిరెడ్డి

↪ నిన్న స్నేహితులు, నేడు రాజకీయ ప్రత్యర్థులు

↪ నువ్వా నేనా అన్నట్లు ప్రచారం



ఓటర్లతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

రాజకీయాలు స్నేహితులు.. తోడబుట్టిన వారు.. ఎవరినీ వదలం... నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థులుగా రంగంలోని టిడిపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వైసిపి అభ్యర్థి వేణంబాక విజయ సాయిరెడ్డిలు నువ్వా నేనా అన్నట్లు ఎన్ని కల ప్రచారంలో దూసుకుపోతున్నారు. నిన్నటి వరకు ఇద్దరు స్నేహితులు ఢిల్లీలో చట్టా పట్టాల్ వేసుకు తిరిగిన వారు..ఇప్పుడు రాజకీయ ప్రత్యర్థులుగా విడివిడిగా విమర్శలు చేసుకుంటూ సాగుతున్నారు. తన వ్యక్తిగత జీవితం, సేవా కార్యక్రమాలు, పార్టీ బలం తనకు అండగా వేమిరెడ్డి వెళుతుండగా, అధికార వైసిపి, జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ కార్యక్రమాలు, పార్టీలో రెండో స్థానం ఇవన్నీ తనకు అనుకూలమంటూ వేణంబాక చెబుతున్నారు. నెల్లూరులో ఇద్దరు .పెద్దారెడ్ల పోటీలో రాజకీయం వేడెక్కింది. సామదాన, దండోపాయాలు ఉపయోగిస్తున్నారు. అటు, ఇటు పార్టీ చేరికలు ఊపందుకున్నాయి..

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

రాజకీయాలు ఎప్పుడు ఎలా మారుతాయో ఎవరికీ తెలీదు. నెల రోజుల క్రితం వరకు వైసిపి పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇప్పుడు టిడిపి అభ్యర్థి అయ్యారు. విశాఖపట్నం నుంచి పోటీచేస్తారని భావించిన విజయసాయిరెడ్డి వైసిపి అభ్యర్థిగా మారారు. రాజకీయాలు రోజు రోజుకు మారి పోతున్నాయి. వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తొలుత వైసిపి అభ్యర్థిగా ఉన్నప్పటికి నెల్లూరు అభ్యర్థి ఎంపిక విషయంలో పార్టీ నాయకత్వం వ్యవహరించిన తీరును నిరసనగా పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయంపై సీరియస్‌గా తీసుకున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నారు. తన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కోవూరు టికెట్ రావడంతో ఇద్దరు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఎప్పుడు ఏసి వదిలి బయటకు రాని వారు తమ రాజకీయ భవిష్యత్తు కోసం ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు తమ నియోజకవర్గాల ప్రజల్లో తిరుగుతున్నారు. ఒకప్పుడు ఎవరితో మాట్లాడని వారిద్దరు ప్రజలతో మమేకం అవుతున్నారు. విపిఆర్ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో జిల్లా వ్యాపితంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వందకు పైగా తాగునీటి ప్రాజెక్టులు, విపిఆర్ విద్య, వైద్యం వంటి కార్యక్రమాలు చేశారు. ఇది వారి విజయానికి కొంత ఉపయోగపడుతుందని ఆపార్టీ నేతలు భావిస్తున్నారు. ప్రభుత్వం వ్యతిరేకత, టిడిపికి అనుకూల పరిస్థితులు తమ విజయానికి కారణం అవుతుందని వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చెబుతున్నారు. జిల్లా వాసిగా, సౌమ్యుడుగా పేరున్న ఆయనకు సానుకూలత ఉంటుందని ఆపార్టీ నేతలంటున్నారు. టికెట్ ఆశించి దక్కని నేతలు టిడిపికి వ్యతిరేకంగా ఉన్నారు. ప్రచార వ్యూహాలు, టీమ్‌ల పనితీరు వంటి చిన్ని చిన్న సమస్యలున్నప్పటికీ ప్రజల్లోని సానుకూలత అయన , మంచి పేరుతో విజయం ఖాయం అన్న ప్రచారం సాగుతోంది. నిన్నటి మిత్రుడు విజయసాయిరెడ్డిపైనా వ్యక్తిగత విమర్శలు చేయకుండా, తాను చేసిన పనులు చెప్పుకోవడం ,తాను గెలిస్తే ఏం

▸ 2లో

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

సిపిఎం నెల్లూరు నగర నియోజకవర్గ అభ్యర్థి మూలం రమేష్



ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్న సిపిఎంను ఎన్నికల్లో ఆదరించాలని, రాజకీయాన్ని వ్యాపారంగా చేసి సంపాదనకు ఒక సాధనంగా మార్చుకుం టున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని నగర నియోజకవర్గ సిపిఎం అభ్యర్థి మూలం రమేష్ పిలుపు నిచ్చారు. శనివారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో 5వ డివిజన్ పరిధిలోని సత్య నారాయణపురం ప్రాంతంలో ఇంటింట ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బోడిగాడి తోట ప్రాంతంలో కార్పొరేషన్‌కు సంబంధించిన డంపింగ్ యార్డు ఉన్నప్పుడు ఆక్కడ నుంచి దుర్గంతభరితమైన వాసనలు వెదజ లుతుండటం, ఆ కారణంగా ఈ ప్రాంత వాసులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్న సమయంలో సిపిఎం ఆందోళన కార్యక్రమాలు చేపట్టి డంపింగ్ యార్డును ఆ ప్రాంతం నుంచి తరలించేందుకు కృషి చేసిందన్నారు. మరో ప్రక్క ప్రతి ఏడాది వరదలు సంభవించిన సమయంలో ప్రాంతం ముంపుకు గురౌతుందని, అంతే కాకుండా వరద నీటి ఉధృతికి భూభాగం కుంగిపోయి ఇళ్ళు పడి పోయిన సందర్భాలు అనేకం ఉన్నా యన్నారు. ఈ నేపథ్యంలో వరదలు సంభవించిన సమయంలో కలిగే నష్టాన్ని అధిగమించేందుకు పెన్నా ప్రాంతంలో

▸ 2లో

పోలింగ్ నిర్వహణలో

పిఒ, ఎపిఒలు కీలకం : కలెక్టర్



ప్రజాశక్తి -నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ పోలింగ్ అధికారులకు సూచించారు. శనివారం వెంకటాచలం సమీపం లోని క్యూబా ఇంజనీరింగ్ కళా శాలలో పిఒ, ఎపిఒలకు నిర్వహిస్తున్న పోలింగ్ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. శిక్షణ ఇస్తున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్, పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ శిక్షణత తరగతులను సద్వినియోగం చేసుకుని అన్ని సందేహాలను నివృత్తి చేసుకోవాలన్నారు. ఈనెల 15న మరో విడత శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నట్లు తెలిపారు. సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి చిన్న ఓబులేసు, ఎఆర్‌వో పూర్ణచంద్రరావు, డిటి మురళీ ఉన్నారు.

ప్రచార హోరు.. ▸ 2లో

ఆక్వా రైతులను ముంచిన వైసిపి ప్రభుత్వం ▸ 3లో

ఎస్ఆర్‌కె స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి ▸ 3లో

నగదు, మద్యం

అక్రమ రవాణా నివారణకు పటిష్ట చర్యలు : ఎస్‌పి



ప్రజాశక్తి -నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నగదు, మద్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని ఎస్‌పి కె.ఆరీఫ్ హాఫీజ్ శనివారం తెలిపారు. జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాలలో చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం, నాటు సారా, గంజాయి మొదలగు ఇతర అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. తగిన రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న చిన్నబజార్ పరిధిలో రూ. 5 లక్షలు, వేదాయపాలెం పరిధిలో రు.5 లక్షలు, మనుబోలు పరిధిలో రు. 1,13,800లు-, ముత్తుకూరు పరిధిలో రు.52 వేలు , పోర్ట్ పరిధిలో రు.1,04,000లు నగదు స్వాధీనం చేసుకు న్నామ న్నారు. పేకాట స్థావరంపై దాడులు చేసి అల్లూరు పరిధిలో ఐదుగురుని అదుపులోకి తీసుకొని నగదు రు.1700లు-, కావలి రూరల్ పరిధిలో ముగ్గురుని అదుపులోకి తీసుకొని రు.1870 లు/- నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మున్సిపల్ కార్మికుల బకాయిలు చెల్లించాలని వినతి

ప్రజాశక్తి-నెల్లూరు

మున్సిపల్ కార్మికులకు మార్చి నెల వేతనం, పెండింగ్ లో ఉన్న హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది.ఈ మేరకు శనివారం కలెక్టరేట్ ఏఓను కలిసి వినతిపత్రం అంద జేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి కె. పెంచల నరసయ్య మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు మార్చి నెల వేతనం నేటి వరకు అందజేయ లేదన్నారు. ఆత్మకూరు, కావలి మున్సిపాలిటీలలో గత రెండు నెలల నుండి కార్మికులకు వేతనాలు చెల్లించలేదన్నారు. అదేవిధంగా సంక్రాంతి కానుక వెయ్యి రూపాయలు అందజే యాలని పేర్కొన్నప్పటికీ జిల్లాలో ఏ మున్సి పాలిటీలో కార్మికులకు పండుగ కానుక అందజేసిన దాఖలాలు లేవన్నారు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కావలి మున్సిపాలిటీలో మూడు నెలల నుండి జీతాలు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పెండింగ్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ తో పాటు జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో మార్చి నెల బకాయి జీతం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులు గా పనిచేస్తున్న వారంతా దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన నిరుపేదలని వారి జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదు ర్కొం టున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా అధ్యక్షురాలు కామా క్షమ్మ, నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు అశోక్, దేశ మూర్తి, కొండమ్మ, భాగ్యమ్మ, లోకేష్, శీను, రవీంద్ర, సలోమి పాల్గొన్నారు.

వేమిరెడ్డి X వేణుంబాక

(మొదటి పేజీ తరువాయి)

చేస్తానోననే చెప్పడం ఆయన ప్లస పాయింట్‌గా చెప్పొచ్చు. వైసిపి అభ్యర్థిగా పని చేస్తున్న వేణుంబాక విజయసాయిరెడ్డి జిల్లా వాసి, ఇక్కడే చదువుకోవడంతోపాటు, అనేక చోట్ల ఆడిటర్‌గా పనిచేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పోలీసులు, ఇతర అధికారుల సహకారం ఉంటుందని ఆశపడుతున్నారు. పింఛన్లు, జగన్న ఇళ్లు వంటివి తనకు అనుకూలమని భావిస్తున్నారు. వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత కనిపిస్తోంది. సంక్షేమ కార్యక్రమాలు తప్ప, అభివృద్ధి కనిపించలేదనే విమర్శలున్నాయి. రోడ్లు, డ్రెయినేజీ, టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లు పంపిణీ చేయకపోవడం, జిల్లా వ్యాపితంగా రౌడీలు, బ్లేడ్‌బ్యాచ్‌లు, గంజాయి, మాదకద్రవ్యాలు వంటివి ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది. విజయసాయిరెడ్డికి ఇక్కడ వ్యాపారులు లేకపోయినా ఎంఎల్‌ఎలు చేసిన అవినీతి, అక్రమాలు విజయసాయిరెడ్డికి కొంత వ్యతిరేకత కలిగే అవకాశాలున్నాయి. పార్టీలో నెలకొన్న అసమ్మతి నేతలను బుజ్జగించి తన రాజకీయ చతురత ప్రదర్శించి మళ్లీ పార్టీలో తెచ్చుకోవడం విజయం సాధించారు. ఎంఎల్‌ఎ మహీధర్‌రెడ్డి, సుకుమార్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, నల్లపరెడ్డిరాజేంద్రనాథ్‌రెడ్డి, ఆనం జయకుమార్ లాంటి వారిని తిరిగి పార్టీలో తెచ్చుకున్నారు. పార్టీపై ఉన్న వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందో తెలియడం లేదు. వలంటీర్ల ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన వైసిపికి ఎన్నికల సంఘం చెక్‌పెట్టింది. ఇప్పుడు ప్రతి బూత్‌కూ జగన్న సైన్యం పేరుతో ఓటర్లను మభ్యపెట్టే పనిలో ఉన్నారు. ఇద్దరు నెల్లూరు పెద్దారెడ్లకు అనుకూల, వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. మరో 30 రోజులు సమయం ఉండడంతో ఎవరికి ఏ పరిస్థితులు సానుకూలి స్తాయో చూడాలి. రాష్ట్ర వ్యాపితంగా అందరి చూపు నెల్లూరు పార్లమెంట్ ఫలితాలపైనే ఉంది. ఏం జరుగుతుందో చూడాలి.

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు

మండలంలోని దప్పలంపాడు గ్రామానికి చెందిన కనకమేడల వెంకట్రావు, వెంకటరత్నం దంపతుల కుమారుడు వెంకట సురేంద్రకు లింగసముద్రం మండలం, వీరరాఘవునికోట గ్రామస్థులు అడుసుమల్లి వెంకటేశ్వర్లు, నారాయణమ్మ దంపతుల పుత్రిక అమూల్యతో శుక్రవారం రాత్రి దప్పలంపాడు గ్రామంలో వివాహం జరిగింది. యువనాయకులు నెల్లూరు పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలువురు టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

ఐఎఫ్‌సి ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి-కందుకూరు

పట్టణంలో నివసించే రియాజ్ కి గత కొద్ది నెలలుగా కంటి చూపు సరిగా కనపడని కారణంగా ఆపరేషన్ చేయించుటకు తగిన ఆర్థిక స్థోమత లేక ఐ.ఎఫ్.సి ఫౌండేషన్ని ఆశ్రయించారు. ఫౌండేషన్ వారు రియాజ్ యొక్క ఆర్థిక స్థితిని పరిశీలించి దాతల సహకారంతో ఒంగోలు మోడరన్ కంటి ఆసుపత్రిలో నేడు దగ్గర ఉండి కంటికి శస్త్ర చికిత్స చేయించారు. సహాయం అందించిన దాతలకి ఫౌండేషన్ సెక్రెటరీ షంషేర్ ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలలో పరిశీలన

ప్రజాశక్తి-గుడ్లూరు

గుడ్లూరులోని ఐదు పోలింగ్ కేంద్రాలని ఎంపిడిఒ వై వెంకటేశ్వర్లు, ఎస్ఐ లక్ష్మణరావు శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలని కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఎండ తగలకుండా షామియాణాలు వేయాలని ఎంపిడిఒ తెలిపారు. మే 13న తారీకు జరగనున్న ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు పరిశీలిస్తున్నట్లు వారు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

(మొదటి పేజీ తరువాయి)

గోడ) నిర్మించి ప్రజల ఆస్థులను కాపాడేందుకు ఈ ప్రభుత్వం కనీస భాద్యతగా తీసుకొని నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణ సంస్కరణల పేరుతో ఇంటి పన్ను పెంపు, వాటర్ ఛార్జీలు పెంపుదల, చివరకు చెత్త పన్ను విధించడం ప్రజలపై ఆర్థిక భారాలు మోపడం సరికాదన్నారు. ఖేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం విభజన హామీలను అనుసరించి ప్రత్యేక హోదా ప్రకటించకుండా ద్రోహం చేసిందన్నారు. ఎన్నికల సమయంలో నల్లదనాన్ని వెలికి తీసి ప్రతి నిరుపేద బ్యాంకు ఖాతాలో రూ. డీజల్, పెట్రోల్ ధరలు పెంచి సామాన్య మద్యతరగతి ప్రజలపై భారాలు మోపిందన్నారు. ధరలు తగ్గించేందుకు, నిరుద్యోగ సమస్య పరిష్కరిం చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగ నియామకాలు చేపట్టి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైయివేటీకరణ చేసి లక్షలాధి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కాలరాసిందన్నారు. విద్యుత్తు బిల్లులు పెరిగిన సమయంలో తగ్గించాలంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేశామన్నారు. టిడిపి,వైసిపి అభ్యర్దులు ఇబ్బిడి ముబ్బిడిగా నగదు, మద్యం పంపిణీ చేసి ఓట్లు కొనుగోలు చేసి రాజకీయాన్ని వ్యాపారంగా మార్చి సంపాదనకు ఒక సాధనంగా మార్చుకుంటున్నారన్నారు. ప్రజలకు బతుకుతెరువు ఒక సమస్యగా మారిపోయిన ఈ రోజుల్లో దీనికి వ్యతిరేకంగా పోరాటం చేసే సిపిఎం అభ్యర్ధి గెలుపుకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపు నిచ్చారు.జిల్లాలో జెన్‌కో ను ప్రయివేటీకరణ చేయకుండా అడ్డుకున్నామంటే ఒక్క సిపిఎం, ట్రేడ్ యూనియన్లు చేసిన పోరాటఫలితమే అని గుర్తు చేశారు.కార్మికులు, కర్షకుల, నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం పోరాటాలు, ఉద్యమాలు చేస్తు అండగా నిలుస్తున్న పార్టీ సిపిఎం అన్నారు. సిపిఎం నాయకులు టి.వి.వి. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రానికి తీవ్రంగా అన్యాయం చేసిన బిజెపితో ప్రత్యక్షం గా,పరోక్షంగా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు జతకట్టాయన్నారు. దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల్లో జిల్లాకు ఒక ప్రత్యేకత చోటు చేసుకుందన్నారు. ఒక ప్రక్క కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేసిన మూలం రమేష్ ఒక ప్రక్క, నగదు, మద్యం పంపిణీ చేస్తూ ఏ విధంగా అయినా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆరాటపడుతున్న వైసిపి, టిడిపి పార్టీలు పోటీ పడుతున్నాయన్నారు. నగరంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ, దోమ నివారణ, మంచినీటి సరఫరా, ఇంటి పన్ను సమస్యలు ఇలా పలు సమస్యలపై ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేసింది సిపిఎం పార్టీ ఒక్కటే అన్నారు. అటువంటి చరిత్ర కలిగినది సిపిఎం మాత్రమే అన్నారు. నగరంలో అభివృద్ధి చెందాలన్నా,ప్రజల సమస్యలు పరిష్కారం కావాలన్నా, ప్రజల సమస్యలను చట్టసభల్లో ప్రస్తావించాలన్నా సిపిఎం పార్టీకి చెందిన అభ్యర్ధి అసెంబ్లీకి వెళ్తేనే సాధ్యమౌ తుందన్నారు. అటువంటి వ్యక్తిని గెలిపిం చాలని ఓటర్లుకు పిలుపు నిచ్చారు.ఈ ప్రాంతంలో సిసి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం, మంచినీటి సరఫరా సమస్యలకు పరిష్కారం ఒక్క సిపిఎం కార్పోరేటర్ చేసిన పోరాటంతోనే లభించిందన్నారు. సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు జి. నాగేశ్వరరావు,షేక్. మస్తాన్ బీ, నగర కమిటీ సభ్యులు చిరంజీవి, ఏమేలు, మహిళా సంఘం నాయకులు కత్తి పద్మ, మల్లీశ్వరి, స్థానిక నాయకులు రాంబాబు, చిరంజీవి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజా, ఇందుకూరు పేట మండల నాయకులు కోటేశ్వరరావు, రైల్వే గూడ్స్ షెడ్ నాయకులు శంకరయ్య, శ్రీకాంత్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

‘టిఆర్ఆర్’ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కందుకూరు

ఈనెల 12న విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాలలో కందుకూరు పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు గతంలో ఎన్నడూ లేని అత్యధిక మార్పులు సాధించి కళాశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేశారని కళాశాల ప్రిన్సిపల్ కదిరి నాగేశ్వరరావు అన్నారు . కళాశాల సీనియర్ ఎంపీసీ విభాగము నందు కుడుముల అఖిల 1000 మార్కులకు గాను 966 మార్కులు సాధించి కళాశాలకు మంచి ఫలితాలను అందించిందన్నారు. బైపీసీ నందు టీ నయోమి 916 మార్కులు, సీఈసీ నందు మహాలక్ష్మి హెచ్ఈసీ నందు సింధూర,ఎం పి హెచ్ డబ్ల్యు నందు ఎం కీర్తి శ్రీజ కళాశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా జూనియర్ ఇంటర్ విద్యార్థులు ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు గాను 440 మార్కులు సాధించిన విద్యార్థి కోలా మనోజ్ కుమార్ ను అధ్యాపకులు అభినందించడం జరిగినది. అదేవిధంగా బైపీసీ నందు నిం లావణ్య 366 మార్కులు, సీఈసీ నందు బి శ్రావణి 415 మార్కులు, హెచ్ఐసి నందు డి భాను 381 మార్కులు, ఎంపీహెచ్డబ్ల్యు నందు కే వంశిక 500 కు 462 మార్కులు, ఓ ఏ ఎస్ నందు భాను 455 మార్కులు సాధించి కళాశాలనాకు మంచి ఫలితాలు అందించినారు, ఫలితాలు అందించిన అధ్యాపకులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలియజేశారు .ఎంపీసీ విభాగంలో 470 కి గాను 460 మార్కులు సీనియర్ విద్యార్థిని కుడుముల అఖిల సాధించడం పట్ల ప్రిన్సిపాల్ అధ్యాపకులు మస్తాన్వలి, వెంకటేశ్వరరావు, బాబురావు, కాశీ రత్నం ,మాధవి లక్ష్మి, రాజశేఖర్ ,హాజరత్ అయ్యా మిగిలిన అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.



కె అఖిల



మహాలక్ష్మి

మామిడి రైతులకు మేలు చేస్తాం..

ప్రజాశక్తి-ఉలవపాడు

నెల్లూరు పార్లమెంటు పరిధిలోని మామిడి రైతులకు లబ్ధి చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటామని నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి విజయసాయిరెడ్డి అన్నారు. కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలంలో నెల్లూరు ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్,ఎంపి మోపిదేవి వెంకట రమణ,వైఎస్ఆర్ సిపి ఎస్సి విభాగ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ రావులు మామిడి రైతులతో ముఖాముఖిలో కార్యక్రమంలో పాల్గొన్నారు. సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ మామిడి రైతులకు లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. మామిడి రైతులు సంఘటితం చేసి ఒక సోసైటిగా ఏర్పాడి,వారి ఆధ్వర్యంలో నడిచే విధంగా మామిడి ఆహార శుద్ధీ పరిశ్రమ ఏర్పాటుకు కషి చేస్తానని హామి ఇచ్చారు. మామిడి పరిశోధన కేంద్రం యూనిట్ ను ఉలవపాడు ప్రాంతంలో ఏర్పాటుకు ప్రయత్నం చేస్తానన్నారు..



మాట్లాడుతున్న విజయ సాయి రెడ్డి



వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - లింగసముద్రం

మండలంలో మొగిలిచర్ల గ్రామంలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిం చారు. శనివారం సాయంత్రం గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరించి కందుకూరు వైసిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ కుమారుడు వెంకట సాయి ప్రచారం చేపట్టారు. వైసిపి మండల కన్వీనర్ పిచ్చపాటి తిరుపతిరెడ్డి వైసీపీ నాయకులు కొలికి కొండలరావు, మలిరెడ్డి నరసింహారెడ్డి, ఎందోటి పెదమాల్యాద్రి, మలిరెడ్డి రాఘవరెడ్డి, మట్టే వేణుగోపాల్, రాచగర్ల మాలకొండయ్యమట్టే మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



‘మాలకొండ’లో మానుగుంట

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : పవిత్రపుణ్యక్షేత్రం మాల కొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీన రసింహస్వామి దేవస్థానంను కందుకూరు ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి శనివారం స్వామిని దర్శిం చుకున్నారు. ఆలయ అధికారి కె.బి.శ్రీనివాసరావు వారికి ఘనస్వాగతం పలికారు. స్వామిని దర్శించుకున్న వారికి వేదపండితులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను, అన్న ప్రసాదంను పరిశీలించి అధి కారులకు తగిన సలహాలు సూచనలు చేశారు.

మాలకొండ’ ఆదాయం రూ.9. 4లక్షలు

మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తుల నుంచి వివిధ రూపాల ద్వారా రూ 942577 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. బి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకులు గౌరీ శంకర్, నసింహ చార్యులు స్వామి వారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు.

అందుబాటులో విద్యుత్ సమాచారం

ప్రజాశక్తి -నెల్లూరు : విద్యుత్ శాఖ వారు ప్రవేశపెట్టిన వాట్సప్ నెంబర్ 9133 331912 ను ప్రతి ఒక్కరు వినియోగించు కోవాలని జిల్లా సూపరిండెంట్ ఇంజినీర్ వి. విజ యన్ తెలిపారు. ప్రతి ఒక్క వినియోగదారుడు వారి మొబైల్ లో ఈ నెంబర్ ను ఫీడ్ చేసుకోవా లని దీని వల్ల వినియోగ దారునికి చాలా ఉప యోగాలు ఉన్నాయని,వివిధ రకాల సేవల గురించి తెలుసుకోవచ్చని తెలిపారు.

సర్వే కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి-గుడ్లూరు

, తెట్టులో ఉన్న స్టాటిక్స్ లెన్స్ సర్వే కేంద్రాన్ని కలెక్టర్ హరి నారాయణ శనివారం తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి రూ 50000 నగదు మించి ఉండకూడదని, అక్రమ మద్యం సరఫరా గాని ఓటర్లకి ఆయుధాలు ఇచ్చే కార్యక్రమం ఉన్న కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికల సామాగ్రి 10 వేల రూపాయలకి మించి ఉండరాదని సూచించారు. కందుకూరు సబ్ కలెక్టర్ తనిఖీ కేంద్రం మెజిస్ట్రేట్ చెంచమ్మ తాసిల్దారు వెంకటరమణ పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ప్రజాశక్తి -ఉలవపాడు

మండల కేంద్రం ఉలవపాడులో శనివారం అక్రమంగా మద్యం దుకాణం నిర్వహిస్తున్న దార్ల అరవింద్ కుమార్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఉలవపాడు ఎస్సై బాజీరెడ్డి తెలిపారు .పోలీసులు దాడి చేయగా అతని వద్ద 28 క్వార్టర్ సీసాలు స్వాధీనం పరుచు కోవడం జరిగింద ఆయన తెలిపారు.అతనిపై కేసు నమోదు చేశారు.

ఎస్.ఆర్.కె స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-వెంకటాచలం

ఎస్ఆర్‌కె స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి మాట్లాడుతూ .ఎస్.ఆర్.కె స్కూల్ వ్యాన్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా శుక్రవారం మహిళ ప్రాణాలు కోల్పోయిందన్నారు. అదే స్కూల్ వ్యాన్‌లోని విద్యార్థులకు ఎమైనా జరిగి ఉంటే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. ర్యాష్ డ్రైవింగ్



మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

చేసే వారిని డ్రైవర్ గా ఎలా పెట్టుకుంటారని ధ్వజమెత్తారు. అసలు ఒంటిపూట బడులు నిర్వహించకుండా సాయంత్రం వరకు పాఠశాల నిర్వహించడ మేంటన్నారు. జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు నిద్రపో తున్నారా లేక ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాల వద్ద ముడుపులు తీసుకుని మౌనంగా ఉన్నారా అని విమర్శి ంచారు. ఒంటిపూట బడులు నిర్వహి ంచ కుండా ఉండే పాఠశా లలపై చర్యలు తీసుకోవాలని ఇది వరకే ఎంఇఒ తెలియజేశా మన్నారు. అసలు ఎంఇఒ ఉన్నారా లేక మామూళ్ల మత్తులో మునిగిపోయారా అని దుయ్యబట్టారు. పలుమార్లు ఎస్ఆర్ కే పాఠశాలపై ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడం సిగ్గుచే టన్నారు. దీన్ని బట్టి చూస్తే ఎంఇఒ అమ్ముడుపోయినట్లు స్పష్టమవుతోందన్నారు. నిన్న జరిగిన ఘటనపై పోలీసు అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని నిజనిజాలను వెలికితీ యాలని కోరారు. ఇప్పటికైనా విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఎస్ఆర్ కె పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమా ండ్ చేశారు. అవసరమైతే ఎస్ఆర్‌కె పాఠ శాలను సీజ్ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరిం చారు.కార్యక్ర మంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మనోజ్, మస్తాన్, కాలేషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి-వెంకటాచలం

2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. శనివారం వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన స్టాటిటికల్ సర్‌వైవల్ టీం చెక్‌పోస్టును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాత్రివేళల్లో కూడా తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని, ముఖ్యంగా ట్రాన్స్ పోర్టు వాహనాలను, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్ఎస్‌టి టీమ్ లీడర్ కళారాణిని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సులను కూడా తనిఖీ చేయాలన్నారు.ఎటువంటి అనుమతి లేకుండా రవాణా చేసే పార్శిళ్లను తనిఖీ చేసి సీజ్ చేయాలన్నారు.ప్రతి పార్శిల్‌కు బిల్లులను సరిచూడా లన్నారు. కలెక్టర్ వెంట డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి, సిఐ అంకమరావులు ఉన్నారు.



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోటంరెడ్డి

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా


ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

రాష్ట్రంలో అరాచక పాలనకు అంతం పలికేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని... పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటానని నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపి ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20,23, 24వ డివిజన్‌లకు చెందిన కొంతమంది వైసీపీ నుంచి టిడిపిలోకి నెల్లూరు రూరల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి తెలుగుదేశం పార్టీలోకి సాదరంగా ఆహ్వానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీలోకి వలసలు వస్తున్నారన్నారు. రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రాగానే పేద ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నెల నెల ఇంటింటికి 4వేల రూపాయలు అందించి వారి జీవితాలలో వెలుగు నింపుతామన్నారు. సూపర్ సిక్స్ పథకాల వల్ల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడతాయన్నారు.

ఆక్వా రైతులను ముంచిన వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

వైసీపీ ప్రభుత్వం రైతులను నిండా ముంచేసిందని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. శనివారం మండలంలోని వెంకన్నపాలెం గ్రామంలో సోమిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఆక్వా రైతులను నిండా ముంచేసిందని, ఫలితంగా రైతులు ఆర్థికంగా దివాళా తీసే పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం తెచ్చిందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రిగా కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆక్వా రైతులకు పూర్తిగా నిర్లక్ష్యం చేసేశారని విమర్శించారు. ఎగుమతుల ద్వారా రాష్ట్రానికి విదేశీ మారకద్రవ్యాన్ని తెచ్చి పెట్టే ఆక్వారంగాన్ని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ధ్వజమెత్తారు. అంతేకాకుండా ఆక్వా రంగ విద్యుత్‌ఛార్జీలను యూనిట్‌కు రూ.1.50కు తగ్గిస్తామని చెప్పి రూ.5.60కి పైగా వసూలు చేస్తోందని తెలిపారు. గతంలో ఉచితంగా సరఫరా చేస్తున్న ట్రాన్స్ ఫార్మర్లను రైతులు రూ.4 లక్షలు పెట్టి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వైసీపీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇంత దారుణంగా విద్యుత్ ఛార్జీలు వసూలు చేస్తుంటే ఆక్వా రైతుల తరపున



పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న సోమిరెడ్డి

జిల్లా మంత్రిగా కాకాణి ఏనాడు సిఎం దృష్టికి తీసుకెళ్లిన పాపాన పోలేదని విమర్శించారు. 2003లో రూ.3గా ఉన్న విద్యుత్ ఛార్జీలను అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.30కి తగ్గించిందని, అప్పటికీ నష్టపోతున్నామని ఆక్వా రైతుల అసోసియేషన్ ప్రతినిధులు చెబితే తాను నాటి సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి కేవలం 90 పైసలకు తగ్గించి ఆదుకోవడం జరిగిందని చెప్పారు. 2004లో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డిల పాలనలో ఆక్వాఛార్జీలను భారీగా పెంచారన్నారు. 2014లో మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆక్వా రైతుల సమస్యలను చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి యూనిట్ రూ.2కి తగ్గించినట్లు తెలిపారు. జోన్, నాన్ జోన్, 5 ఎకరాలు, 10ఎకరాలు, 20 ఎకరాలు అనే షరతులు లేకుండా అందరికీ ఒకే ఛార్జీలు వర్తింపజేసినట్లు చెప్పారు. వైసీపీ అధికారంలోకి రావడంతోనే సవాలక్ష నిబంధనలు పెట్టి ఆక్వా రైతుల నడ్డివిరిచిందని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి రాగానే జోన్, నాన్ జోన్ వ్యవస్థను రద్దు చేయడంతో పాటు రై తుల పరిస్థితులకు అనుగుణంగా విద్యుత్ ఛార్జీలను తగ్గించతామని సోమిరెడ్డి హామీ ఇచ్చారు. సోమిరెడ్డి ప ర్యటనతో వెంకన్నపాళెంలో పండగ వాతావరణం మే 13న జరిగే ఎన్నికల్లో మీ ఇంటి బిడ్డగా ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల పర్యటన నిమిత్తం వచ్చిన కోలాట ప్రదర్శనలతో అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ సన్నారెడ్డి సురేష్ రెడ్డి, టీడీపీ కార్య దర్శి ముత్యాలు శ్రీనివాసులు, చింతా సీతారామయ్య టీడీపీ కార్యకర్తలు, నాయకులు భారీ సంఖ్యలో పాల్గొ న్నారు. దీనికి ముందు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి చంద్రమోహన్ రెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ప్రచారంలో కోవూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ప్రశాంతిరెడ్డి

ఫ్లోరైడ్ సమస్యను పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-విడవలూరు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని రెడ్డిపాలెంలో ప్రజలు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తెలుగుదేశం ప్రభుత్వం వచ్చిన వెంటనే ఫ్లోరైడ్ సమస్యకు పరిష్కారం చూపుతామని కోవూరు నియోజకవర్గ ఎన్‌డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాలెంలోని రెడ్డిపాలెంలో ఆమె శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా గ్రామానికి వచ్చిన ప్రశాంతిరెడ్డి కి మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ.. ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రెడ్డిపాలెం గ్రామంలో భూగర్భ జలాలు ఫ్లోరైడ్‌తో నిండి ఉన్నాయన్నారు. ఈ సమస్యని అధిగమించాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. తాను గెలిచిన వెంటనే ఈ గ్రామంలోని ప్రతి ఇంటకీ శుద్ధమైన నీటిని కుళాయి కనెక్షన్ ద్వారా అందిస్తానని హామీ ఇచ్చారు. వైసిపి ప్రభుత్వం చేపట్టిన భూసర్వే ద్వారా గ్రామాల్లోని రైతులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ఒక రైతుకు ఐదు ఎకరాల వ్యవసాయభూమి ఉంటే ఆన్లైన్లో ఒక ఎకరం, రెండు ఎకరాలు ఇలా తక్కువగా చూపిస్తోందని, ఇదెక్కడి విడ్డూరమని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎలాంటి సమస్యలు లేకుండా దీన్ని సరిచేస్తామన్నారు. గ్రామంలోని 45 ఎకరాల తిప్పను వైసిపి నేతలు ఆక్రమించారని ఆరోపించారు. గ్రామంలోని వీధుల్లో సిసి రోడ్లు కానీ, డ్రెయినేజీలు గాని ఎలాంటి అభివృద్ధి జరగడంలేదన్నారు. మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా హిందూ శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థి ంచారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్

ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో తీసుకోవాల్సిన వివిధ ఏర్పాట్లను నెల్లూరు సిటీ నియోజకవర్గ 117 రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి శనివారం పర్యవేక్షించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయా నికి అవసరమైన రక్షణా చర్యలు, బారికేడ్లు, పోలీసుల చెకింగ్ వ్యవస్థ, సిసి కెమెరాల ఏర్పాటు, పౌరులు సంచరించకూడని నిషేధిత ప్రాంతాల మార్కింగ్ తదితర ఏర్పాట్లను డి.ఎస్.పి శ్రీనివాసులు రెడ్డితో కలిసి పరిశీలిం చారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిటీ తహశీల్దార్, సర్వేయర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణలో పిఒ, ఏపీఓల పాత్ర కీలకం

ప్రజాశక్తి-వెంకటాచలం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల (పిఓ/ఎపిఒ) పాత్ర ఎంతో కీలకమని, ఎటువంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ విధులను నిర్వహిం చాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ పోలింగ్ అధికారు లకు సూచించారు. శనివారం వెంకటా చలం సమీపంలోని క్యాబా ఇంజినీరింగ్ కళాశాలలో పిఒ, ఎపిఒలకు నిర్వహిస్తున్న పోలింగ్ శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిం చారు. శిక్షణ ఇస్తున్న విధానాన్ని పరిశీ లించిన కలెక్టర్, పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ అధికారుల పాత్ర ఎంతో



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కీలకమని, శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని అన్ని సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. సుమారు 480 మంది పిఒలు, ఎపిఒలు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈనెల 15న మరో విడత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కలెక్టర్ వెంట సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, చిన్న ఓబులేసు, ఎఆర్ఒ పూర్ణచంద్రరావు, డిటి మురళీలు ఉన్నారు.

పోలీసుల వేషధారణ గర్హణీయం

ప్రజాశక్తి-కావలి


రాజ్యాంగ నిర్మాణకర్త డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి ఏప్రిల్ 14 కాగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 'విశ్వనాథ ఆలయంలో' విధులు నిర్వహించే పోలీసులకు "అర్చకుల మాదిరిగా, ధోతి - కుర్తా ధరించి నుదుటతిలకం దిద్దుకుని విధులు నిర్వహించాలని ఆదేశాలివ్వడం "రాజ్యాంగ నిబంధలను ఉల్లంఘించినట్లేనని కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు అర్చక దుస్తులు ధరించడం ఏ పోలీస్ మాన్యువల్లోనూ కనబడదన్నారు. ప్రజాతంత్ర వాదులు - రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, లౌకిక వాదాన్ని సమర్ధించే ప్రతి పౌరుడు, సామాజిక - శాస్త్రీయ సంస్థలు దానిని తీవ్రంగా ఖండించాలన్నారు. యుపి ప్రభుత్వపు ఈ రాజ్యాంగ వ్యతిరేక ఆదేశం 2024 మే లో జరగనున్న ఎన్నికల్లో బిజెపి హిందూత్వానికి బలమిస్తూ "లౌకికవాదాన్ని నిర్మూలించి మత స్వాతంత్ర్యపు హక్కును ఉరితీసే చర్యలకు మాదిరి రూపంగా ఉందని ఇప్పటికే విధితమవుతున్నదన్నారు. ఇలాంటి అర్చక వేషధారణలో దుండుగులు ఆగంతకులు ఆలయంలోకి ప్రవేశించి, విధ్వంసాన్ని సృష్టించే ప్రమాదముందని గ్రహించి తక్షణమే ఈ ఆదేశాలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ సారి బిజెపిని గెలిపిస్తే దేశాన్ని "మతరాజ్యంగా మారుస్తుందని, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా పక్కనబెట్టి" మనుధర్మ శాస్త్రాన్ని పాటించేలా ప్రమాదకర పాలనా విధానం ఉండబోతుందన్నారు. లౌకిక - ప్రజాతంత్ర శక్తులు ఏకమై, ఓటర్లకు అవగాహన కల్పించాలని పిలుపునిస్తున్నామన్నారు. క్యారక్రమంలో కావలి ఉమెన్స్ ఫోర్స్ సభ్యులు సి.శారద, టి.సుజాత, ఫాతిమా, నూర్జహాన్, లలిత, జమీ, లావణ్య, పుష్పాంజలి తదితరులున్నారు.



టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని బూదవాడ సర్పంచ్ మంచాల హరిబాబు, తండ్రి చిన్నకృష్ణయ్య, మాజీసర్పంచ్ మేకల శ్రీనివాసులు, ఇర్లపాడు వైసిపి నాయకులు గుర్రం నాగేశ్వరరావుతో పాటు మరో 50కుటుంబాలు ఆత్మకూరు టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించించి టిడిపి కండువాలు కప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆనం గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. వారివెంట మాజీ ఎంపిపి పుట్టం బ్రహ్మానంద రెడ్డి, చాబ్రోలు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, మాజీ సర్పంచ్ శాఖమూరి నారాయణ, టిడిపి నాయకులు హాజరత్ బాబు ఉన్నారు.



టిడిపిలో వైసిపి కౌన్సిలర్ చేరిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలో వార్డ్ కౌన్సిలర్, పలువురు నాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. శనివారం చేజర్ల రామనారాయణరెడ్డితోటలో టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డి సమక్షంలో ఆత్మకూరు 9వ వార్డు కౌన్సిలర్ కొప్పోలు రమాదేవి, కొప్పోలు చిన్నపరెడ్డి, నర్సాపురం మాజీ సర్పంచి అల్లంపాటి రమాదేవి, చిట్టమూరి సుబ్బారెడ్డిలు టిడిపి కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. గతంలో ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరును ఎంతగానో అభివృద్ధి చేశారని, ఆయనను మళ్లీ ఎంఎల్ఎగా గెలిపించుకుంటే ఆత్మకూరు అభివృద్ధి వేగంగా జరుగుతుందనే ఆలోచనతో టిడిపిలో చేరినట్లు వారు తెలిపారు. వారివెంట మున్సిపల్ షేక్ సర్దార్, టిడిపి పట్టణ అధ్యక్షులు చంద్రారెడ్డి, కాలం బుచ్చిరెడ్డి, ఎన్ ప్రసాద్ తదితరులున్నారు.

అధికారుల వింత వైఖరి..

- తహశీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతూ రైతుల ఇబ్బందులు

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఎన్నికల సమావేశాలు అంటూ తరచూ కలెక్టర్ కార్యాలయం తహశీల్దార్ కార్యాలయంలో పని ఉందంటూ రెవెన్యూ అధికారులు తహశీల్దార్ కార్యాలయం వైపు రాకపోవడంతో కార్యాలయాలకు పలు రకాల పనులపై వచ్చే రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతుల భూములకు సంబంధించిన డిజిటల్ సైన్ ఏ సమయంలో లాక్ అవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పంట రుణాలు, రెన్యువల్ చేస్తున్న సమయంలో తరచూ భూముల డిజిటల్ సైన్ లాక్ అవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ భూములను డిజిటల్ సైన్ లాక్ ఓపెన్ చేయాలని తహశీల్దార్ కార్యాలయం చుట్టూ నెలల కొద్ది తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో ఈ పరిస్థితి నెలకొంది. తాము ఎన్నికల విధుల కోసం వచ్చాం ఇప్పటికిప్పుడు లాక్ ఓపెన్ చేయ లేమంటూ తహశీల్దార్లు ఖరాకండిగా చెబుతున్నారు. ఎన్నికల ముందు ఉన్న తహశీల్దార్లు ఎవరైనా భూములు లాక్ అయితే ఫిర్యాదు అందిన వెంటనే లాక్ ఓపెన్ చేసేవారు. కానీ, ఇటీవల కాలంలో ఎన్నికల విధులు కోసం వచ్చిన తహశీల్దార్లు తరచూ సమావే శాలు అంటూ జిల్లా కేంద్రమైన నెల్లూరుకు వెళ్లడం జరుగుతుంది. కొత్త పట్టాలు ఇవ్వకపోయి ఉన్న సమస్యలు పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు వివరిస్తున్న తీరు రైతులకు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. చిన్న సర్టిఫికెట్ కావాలన్నా కార్యాలయం చుట్టూ రోజులు తరబడి తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో అయితే ఒకరోజు రెండు రోజుల్లో అయిపోయే పని ఇప్పుడు వారం నెలలు పడుతుంది. రైతులు భూములు డిజిటల్ సైన్ ఎప్పుడు లాక్ అవుతుందో ఎప్పుడు ఓపెన్ అవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. రైతులకు సంబంధం లేకుండా తరచూ భూములు లాక్ అవడంతో రైతులు తమ పంటను రెన్యువల్ చేయలేక పోతున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బంది లేకపోవడంతో కార్యాలయాలు బోసి పోతు న్నాయి. మే 13న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటినుంచే తహశీల్దార్ కార్యాలయం ఖాళీగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు, రైతులకు కావాల్సిన సర్టిఫి కెట్లు ఇవ్వడంలో కొత్తగా వచ్చిన తహశీల్దా ర్ ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.



వరికుంటపాడు తహశీల్దారు కార్యాలయం

అధికారులు చేసిన తప్పిదం వల్ల రైతుల నష్టపోతున్నా సరిదిద్దే నాథుడే లేడు. వరికుంటపాడు తహశీల్దార్ కార్యాలయం లో ఎప్పుడు రెవెన్యూ అధికారులు ఉంటా రో ఎప్పుడు సమావేశాలకు వెళ్తారో చెప్ప లేని పరిస్థితి నెలకొంది. మిగిలిన అన్ని కార్యాలయాలకు అధికారులు సక్రమంగా వస్తున్న ఒక తహశీల్దార్ కార్యాలయం ఖాళీగా కనిపిస్తుంది. కలెక్టర్ స్పందించి కనీస పనులైనా చేయించాలని పలువురు కోరుతున్నారు.

20 రోజుల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం..

పాణ్యం ఆదిలక్ష్మమ్మ, కనింపాడు గ్రామం

తమకు భూమి ఉండి బ్యాంకులో రుణం తీసుకుని ఉన్నాం. రుణం మొత్తం చెల్లిం చాం. మళ్లీ రుణం పొందేందుకు వన్‌బి అడంగల్ బ్యాంకులో సమర్పించాల్సి ఉం ది. వన్‌బి అడంగల్ కోసం కార్యాల యం చుట్టూ తిరుగుతున్నాము. తహశీల్దార్ అందుబాటులో లేరు. ఎన్నికల పనుల నిమిత్తం నెల్లూరు, ఉదయగిరి వెళ్తున్నారు. 20రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం. మమ్మల్ని ఇలా తిప్పించు కోవడం కరెక్ట్ కాదు.



'సిఇసి'లో ఆణిముత్యం 'భావన'

ప్రజాశక్తి-కావలి

కావలిలోని శ్రీ శ్రీనివాసా జూనియర్ కళాశాలలో మేలుజాతి ఆణిముత్యం సిఇసి గ్రూప్ జాతిరత్నం ఎ.వి. భావన జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాలలో 478/500 మార్కులు సాధించి కావలి టౌన్ ఫస్ట్ ర్యాంక్‌లో నిలిచి తన కళాశాలకే గుర్తింపు తెచ్చిపెట్టింది. ఈ సందర్భంగా కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో భావనను కళాశాల కరెస్పాండంట్ బి.అశోక్ కుమార్, డైరెక్టర్, కె.కోటేశ్వరరావు, ప్రిన్సిపాల్ బి.మాలకొండయ్య, అధ్యాపక వర్గం ఘనంగా అభినందించారు. తాము బోగోలు మండలం నుండి తమ బిడ్డ చదువుకోసం కావలికి కాపురం వచ్చి శ్రీ శ్రీనివాసా జూనియర్ కళాశాలలో చేర్పించామని, ఆమె ఇలా జూనియర్ ఇంటర్లోనే టౌన్ ఫస్ట్ ర్యాంక్ సాధించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థిని తల్లిదండ్రులు ఎం.ఎ. రవికుమార్, అన్నాల్ దంపతులు హర్షం వ్యక్తం చేశారు. అందుకు సహకరించిన కళాశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.

'విజయ సంకల్ప యాత్ర'



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉదయగిరి : మండలంలోని వెంగళరావునగర్‌లో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి శనివారం విజయ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీఇంట జగన్మోహన్ రెడ్డికి ఆదరణ చూపుతున్నారని ఆయన తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంట్లో మహిళ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదిగామని వారు సంతోషంగా చెప్పడం ఆనందదాయకమన్నారు. వలంటీర్ వ్యవస్థను రద్దుచేసి వృద్ధులు పడుతున్న బాధను చూస్తూ టిడిపి జనసేన బిజెపి ప్రభుత్వాలు సంతోషపడుతున్నా యన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి, ఎంపి అభ్యర్థి విజయ సాయిరెడ్డి గెలుపు ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.తిరుపతి, మండల కన్వీనర్ ఓబుల్ రెడ్డి, ఎంపిపి మూలె పద్మజా వినయ్‌రెడ్డి, జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, అక్కి భాస్కర్‌రెడ్డి, నాయకులు అబ్దుల్లా ఖాజా, ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, జెసిఎస్ కన్వీనర్ కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

15న 'ప్రజాగళం'



ప్రజాశక్తి-మర్రిపాడు : 15వ తేదీన జరుగునున్న టిడిపి ప్రజా గళం శంఖారావం సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయా లని టిడిపి మండల అధ్యక్షులు అరికట్ల జనార్ధన్‌నాయుడు తెలియజేశారు. నెల్లూరు-ముంబై జాతీయ రహదారి పక్కన ఉన్న వెల్కమ్ డాబా వద్ద నుండి భారీ ర్యాలీతో సభా ప్రాంగణం చేరుకుంటారు. ప్రజా గళం సభకు ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఎ అభ్యర్థి ఆనం రామ నారాయణ రెడ్డి, ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాంతకుమారి, మాజీ ఎంఎల్ఎలు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

మెట్టప్రాంత అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-ఉదయగిరి

మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి కాకర్ల సురేష్‌తోనే సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. హైదరాబాద్ మహా నగరంలో బి.ఎన్.రెడ్డి నగర్‌లో ఉదయగిరి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి వలసవాసులు అపూర్వ స్వాగతం పలికారు. బి.ఎన్.రెడ్డి నగర్, వనస్థలిపురం, ఎల్‌బినగర్, దిల్‌సుఖ్ నగర్ పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న ఉదయగిరి నియోజకవర్గ సభ్యులు అందరూ ఈ సమావేశానికి హాజరై కాకర్ల సురేష్‌కుకి తామున్నామని ధైర్యాన్ని నింపి కాకర్ల సురేష్‌ను గెలిపించుకుంటామని ఘంటాపథంగా తెలిపారు. సభా ప్రాంగణం నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం వర్ధిల్లాలి ఉదయగిరి ముద్దుబిడ్డ కాకర్ల సురేష్ తెలుగుదేశం జిందాబాద్ అంటూ చప్పట్లతో మారుమోగిపోయింది. కాకర్ల సురేష్‌ను పూలమాలతో శాలువాతో సత్కరించుకున్నారు. సమయం దగ్గర పడుతున్న తరుణంలో నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన వలస వాసులందరూ తమ గ్రామాలకు చేరుకొని తెలుగుదేశం గెలుపునకు కృషి చేయాలన్నారు.



కాకర్ల సురేష్‌కు స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

అనంతరం కొండాపురం మండలం గొట్టిగుండాల పాలెం గ్రామ సర్పంచ్ కోవి మాల్యాద్రి తోపాటు 60 కుటుంబాలు వైసిపిని వదిలి టిడిపిలో చేరారు. వారందరికీ ఉదయగిరి ఉమ్మడి ఎంఎల్ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ టిడిపి కండువా కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా వింజమూరు మండలం రావిపాడు మాజీ సర్పంచ్ మోత్కూరు హనుమంతరావు కొండపల్లి సురేష్ దంతులూరి శ్రీనివాసులు పవన్ కుమార్ మోత్కూరు రామాంజనేయులు మోత్కూరు హరీష్ టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో, కొండాపురం మండల కన్వీనర్ మారెళ్లపల్లి ఓంకారం, వింజమూరు మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, కొండాపురం మాజీ జెడ్‌పిటిసి మహేశ్వరరావు, మారెళ్లపల్లి రామయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ప్రతి ఇంటికీ పథకాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

వైసిపి ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని మళ్లీ జగనన్నను దీవించాలని వైసిపి నాయకులు ప్రజలను కోరారు. శుక్రవారం మండలంలోని టి కొండారెడ్డి పల్లిలో ప్రతి ఇంటికి తిరిగి వైసిపి చేసిన అభివృద్ధి పనులు గూర్చి ప్రజలకు తెలియజేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత క్రీయాశీలక పాత్ర పోషించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

రానున్న ఎన్నికల్లో యువత క్రీయాశీలక పాత్రను పోషించి ప్రజల్లో వైసిపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని అందరికీ అర్ధమయ్యేలా వివరించాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శనివారం నెల్లూరులోని మేకపాటి నివాసంలో ఐటి ఆధ్వర్యం లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమా వేశంలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి ఐటి విభాగ నాయకులకు రానున్న ఎన్నికల్లో చేయాల్సిన పనులపై దిశానిర్ధేశం చేశారు. నియోజకవర్గంలో దాదాపు 66 బూత్‌లలో 35శాతం కంటే అధికంగా యువత ఉందని, వారందరిని తప్పకుండా ఓటుహక్కు వినియోగించుకునేలా బాధ్యత తీసుకోవాల న్నారు. మండలాల వారీగా టీములను ఏర్పాటు చేసుకుని ప్రతి ఒక్కరూ ఎన్నికలను బాధ్యతగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఇప్పటి వరకు ప్రజలకు జగనన్న అందచేసిన సంక్షేమాన్ని ప్రతిపక్ష పార్టీ అధికారంలోకి వస్తే ఒక్క సంతకంతోనే దూరం చేయగల రన్నారు. వలంటీర్ సేవలను నిలిపివేసేందుకు ఒక్కరోజే పట్టిందని, ఇంగ్లీషు మీడియం, నాడు-నేడు ఇలా ప్రతి సంక్షేమాన్ని ప్రతిపక్ష పార్టీ నిలుపుదల చేస్తారని, అలా కాకుండా ఉండాలంటే సంక్షేమ ప్రభుత్వమే కొనసాగే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాల న్నారు. ఇప్పటికే ప్రచారంలో టిడిపికి చెందిన నాయకులు ప్రజలను బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నారని, పింఛను కావాలంటే తమనే అడిగే పరిస్థితి తీసుకొస్తామంటూ చెప్పుకొస్తున్నారన్నారు. ప్రజలందరికీ వీడిని తెలియబరిచే అర్హతే ప్రమాణికంగా మన ప్రభుత్వం గత ఐదేళ్లలో ఎలా పనిచేసిందో, రానున్న రోజులలో ఎలా పనిచేస్తుందో వివరించాలన్నారు. అవాస్తవాలను, అబద్ధపు హామీలను సమర్ధవంతంగా తిప్పికొట్టే విధంగా ఐటి విభాగ సభ్యులు పనిచేస్తామని ముందుకొస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కోరిన విధంగా యువత స్టార్ క్యాంపెయినర్లుగా మారి 175 స్థానాల్లో విజయం సాధించే విధంగా కృషి చేద్దామన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి సందర్శన

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట పోలీస్ స్టేషన్‌ను శనివారం ఎస్‌పి ఆరిఫ్ హఫీజ్ సందర్శించారు. ఎన్నికల నియమావళిపై సిబ్బందితో చర్చించారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేలా క్రిటికల్ పొజిషన్లో ఉన్న పోలింగ్ స్టేషన్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించినట్లు తెలిపారు. డిఎస్‌పి వెంకట రమణ, సిఐ నాగభూషణం సిబ్బంది ఉన్నారు.


ఓటు నమోదుకు 14న ఆఖరు

ప్రజాశక్తి-ఉదయగిరి : ఓటర్ నమోదు చివరి తేదీ 14 ఆదివారం రాత్రి 12గంటల లోపు ఓట్లను నమోదు చేసుకోవాలని టిడిపి ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వింజమూరు తెలుగుదేశం ప్రధాన కార్యాలయంలో సహాయ కేంద్రంలో ఓటర్ నమోదును వినియోగించు కోవాలని నియోజకవర్గం ప్రజలను ఆయన కోరారు. ఓటు నమోదుకు కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటో, స్టడీ సర్టిఫికెట్ లేదా రేషన్ కార్డు, జెరాక్స్‌తో పాటు ఇంటి నెంబరు ఫోన్ నెంబరు వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు ఫోన్ 9063 616330 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఖాదర్‌పూర్‌లో 'రచ్చబండ'

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని ఖాదర్‌పూర్ గ్రామంలో మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి శనివారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలను పేరుపేరునా వలకరిస్తూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసిపి నుంచి నెల్లూరు పార్లమెంట్ నభ్యునిగా ఎంపి విజయసాయిరెడ్డి, ఆత్మకూరు ఎంఎల్‌ఎగా తన కుమారుడు మేకపాటి విక్రమ్ రెడ్డి పోటీ చేస్తున్నారని, ప్రతిఒక్కరూ తమ విలువైన ఓటును వృథా చేసుకోకుండా సంక్షేమాన్ని అందించిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి వేసి ఆశీర్వదించాలని కోరారు. 2024లో మళ్లీ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సోమశిల హైలెవెల్ కెనాల్ పూర్తి చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు, విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి ప్రతేడాది అందజేశారన్నారు. జగన్మోహన్ రెడ్డిని మరువద్దని ఎంపి, ఎంఎల్‌ఎ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. నాడు - నేడు పథకం కింద పాఠశాలకు రూ.30లక్షలు మంజూరు చేశారని, బొగ్గేరు నుండి అల్లంపాడు, ఖాధార్పూర్ చేరులకు కాలువలు తవ్విస్తే సమృద్ధిగా పంటలు పడుతాయని స్థానికులు కోరారు. మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రిని చేస్తే మన పనులు పూర్తవుతాయని రెండేళ్లలో ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తామన్నారు. ఆత్మకూరులో ఒకరికి ఎంపిపి పదవి ఇస్తే ఆయన పార్టీకి ద్రోహం చేశారన్నారు. జగన్‌కు, విక్రమ్ రెడ్డికి ఇంకా 30యేళ్లు రాజకీయ భవిష్యత్తు ఉందని, అందరి సమస్యలను పరిష్కరించుకోవచ్చున్నారు. కానీ ఎన్నికల సమయంలో చుట్టపుచూపుగా వచ్చే వాళ్లందరూ ఇప్పుడు కలసికట్టుగా వస్తున్నారని, అలాంటి వారిని నమ్మితే ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డిని రెండుసార్లు ఆత్మకూరు నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదిస్తే ఆయన అభివృద్ధి చేసేందుకు మార్గం వేశారని, ఆయన స్థానంలో వచ్చిన మేకపాటి విక్రమ్‌రెడ్డి మార్గంలో నడిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాడని పేర్కొన్నారు. ఖాదర్‌పూర్ ఎస్‌సి కాలనీ ప్రజలు శ్మశానానికి దారిలేదు, ఫ్లోరిన్ నీటితో అవస్థలు పడుతున్నాం, పిల్లలు పాఠశాలకు వెళ్లాలంటే కిలోమీటర్ వెళ్లాల్సి వస్తుందని వివరించగా ఎన్నికలు తర్వాత అన్ని పనులు చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కన్వీనర్ సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ శ్రీనివాసులు నాయుడు, స్థానిక సర్పంచ్ అన్నవరపు కృష్ణా రెడ్డి, భీమవరం సొసైటీ చైర్మన్ మాధవరెడ్డి, సేవాదల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణప్రసాద్ రెడ్డి, ఎంపిటిసి హాజరత్ రెడ్డి, మైనారిటీ జిల్లా సెక్రటరీ మౌలాలి, నారాయణస్వామి ఖాన్ సావాలి, సిరిపిరెడ్డి భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపి రాజమోహన్‌రెడ్డి



'కాకర్ల' ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కలిగిరి : ఉదయగిరి ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కాకర్ల సురేష్ గెలుపు కోసం తల్లి కాకర్ల మస్తానమ్మ కలిగిరి మండలం వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాలెం గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వెలగపాడు పంచాయతీ కమ్మవారిపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి మహిళలకు కాకర్ల సురేష్ తల్లి తన తనయుడిని గెలిపించాలని అభ్యర్థించారు. టిడిపి ప్రవేశపెట్టనున్న పథకాలను వివరించారు. తమ తనయుడు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని మంచి ఆశయంతో వచ్చారని ఆశీర్వదించాలని తెలిపారు. అలాగే వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి జిల్లాలో 150 వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసి రాజకీయాలలోకి రాకముందు నుండి సేవ చేస్తున్నారని, ఆయన నెల్లూరు ఎంపి అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని ఇద్దరిని గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామ ప్రజలు తనయుడు కోసం చేస్తున్న ప్రచారానికి మద్దతు తెలుపుతూ వారి వెంట నడిచారు. ఏ ఇంటికి వెళ్లినా అపూర్వ స్వాగతం పలికారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కర్నాటి ప్రభాకర్ తెలుగు యువత మహిళ అధ్యక్షురాలు వై.సుజాత, సీనియర్ నాయకులు గన్నపునేని శ్రీనివాసులు నాయుడు, కర్నాటి శ్రీనివాసులు నాయుడు, కొండప నాయుడు, తెలుగు యువత మేదరమెట్ల రామారావు, ముఖ్యనాయకులు తదితరులున్నారు.

వైసిపిలోకి పలువురు చేరిక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



కండువాలు కప్పుతున్న ఎంఎల్‌ఎ విక్రమ్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలకు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులై వారు పార్టీలో చేరుతున్నారని ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్ రెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని 17, 18 వార్డుల నుంచి 100 కుటుంబాలకు చెందిన వారు ఎంఎల్‌ఎ మేకపాటి సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి ఘన విజయానికి కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న సంక్షేమం, అభివృద్ధికి అందరూ వెంట నడిచేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, వైసిపికి ఉన్న ప్రజాబలాన్ని ఢీకొట్టడం ప్రతిపక్ష పార్టీలకు సాధ్యమయ్యే పనికాదని గ్రహించడం వల్లే మొత్తం పార్టీలన్ని మూకుమ్మడిగా కూటమిగా ఏర్పడి 2024 ఎన్నికలకు వస్తున్నాయని తెలిపారు. ఎంతమంది కలిసొచ్చినా ప్రజాబలంతో జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి 175 సీట్లు గెలిచి తీరుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ డాక్టర్ సిహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, డాక్టర్ ప్రణీత్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న నాయకులు

కావలి మండల శివార్లలో చేవూరు దగ్గర రామదూత ఆశ్రమం పేరుతో చెరువు, పోరంబోకు, ఫారెస్ట్ ల్యాండ్ 35 ఎకరాల భూమిని ఆక్రమించుకుని అనుభవిస్తుంటే అధికారులకు అన్నీ తెలిసినా తెలియనట్లు నటించటం దుర్మార్గమని, అటువంటి అధికారులపై హైకోర్టులో కేసులు వేసి కోర్టులో గోడకుర్చీ వేసేవరకు పోరాడతానని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. శనివారం స్థానిక జర్నలిస్టుక్లబ్‌లో వారు మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గుడ్లూరు మండలం చేవూరు సర్వే నెంబర్ 879లో కొంత భూమి, సర్వే నెంబర్ 883లో కొంత మెత్తం 35 ఎకరాల కోట్లాది రూపాయలు విలువ చేసే చెరువు, ఫారెస్ట్ ల్యాండ్ భూములను మార్తాటి వెంకటేశ్వర్లు అనేవ్యక్తి 1997లో ఆక్రమించి జిల్లా సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో ఆ భూమి అంతా తనదేనని తప్పుడు అఫిడవిట్ ఇచ్చి ఆశ్రమం పేరుతో దోచేశారని తెలిపారు. ఆ విషయం తెలిసినప్పటి నుంచి గత 25 సంవత్సరాలుగా హేతువాద సంఘం పోరాడుతుందన్నారు. గుడ్లూరు తహశీల్దార్‌కు, ఆర్‌డిఒ, ప్రిన్సిపల్ సెక్రెటరీ, గవర్నర్, ముఖ్యమంత్రి దాకా అనేకసార్లు ఫిర్యాదులు చేశామన్నారు. అయితే అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ ఉషారాణి 2021లో ఒంగోలు జిల్లా కలెక్టర్‌కు ఆశ్రమం పేరుతో ఆక్రమించిన భూమిని స్వాధీన పరుచుకోవాలని మెమో కూడా ఇచ్చి ఉందన్నారు. మెమో ఇచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న ఇంత వరకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వీరందరిపై హైకోర్టులో కేసు వేయనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ ఇచ్చిన ఆదేశాలు కూడా అమలు చేయని అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు. ఆశ్రమం పేరుతో రామదూత స్వామి అవతారం ఎత్తి, కోట్లాది రూపాయల భూమిని దోచేసిన భూమిని తిరిగి అధికారులు స్వాధీనం చేసుకునేంత వరకూ పోరాడతామని హేతువాద సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జవహర్ భారతి విశ్రాంత ఉపాధ్యాయులు, విరసం నాయకులు ఉన్నం చెంచయ్య, హేతువాద సంఘ సభ్యులు గడ్డం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో నీటి ఎద్దడి..

ప్రజాశక్తి-అనంతసాగరం : మండలంలోని సోమశిల గ్రామంలోని ఉత్తర కాలవ సమీపంలోని తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ కాలనీలో 50 కుటుంబాలు పైగా జీవనం సాగిస్తున్నారు. తాగునీరు లేక ప్రజలు రెండు కిలోమీటర్లు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే సోమశిల గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు వాపోతున్నారు. రోజు రోజుకి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నది. పంచాయతీ అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.



నూతన దంపతులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కావలి : పాత్రికేయులు గర్రె వెంకటేశ్వర్లు కుమార్తె వివాహ కార్యక్రమం శనివారం కావలి పట్టణంలోని బృందావనం కాలనీ కళ్యాణ మండపంలో జరుగుతున్న సందర్భంగా మాజీ శాసనసభ్యులు వంటేరు వేణుగోపాల్ రెడ్డి, కావలి నియోజకవర్గ టిడిపి నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వీరితోపాటు టిడిపి శ్రేణులు, పాత్రికేయులు, ప్రముఖులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా నివాళులు

ప్రజాశక్తి-ఉదయగిరి



చెంచురామయ్య చిత్రపటానికి నాయకుల నివాళులు

మెట్టప్రాంత గండిపాలెం ప్రాజెక్ట్ నిర్మాణ సాధనకర్త పొన్నెబోయిన చెంచురామయ్య వర్ధంతి వేడుకల్లో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీ నాయకులు ఆయనకు ఘన నివాళులర్పించారు. శనివారం చెంచురామయ్య నగర్‌లో మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్ అతిథి గృహంలో ఘనంగా వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా ఆయన తండ్రి చెంచు రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన పలువురు నాయకులు, ప్రముఖులు మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గానికి మొదటి బిసి శాసనసభ్యులు చెంచురామాయ్య అప్పట్లోనే ఈ ప్రాంత రైతుల పరిస్థితి గుర్తించి గండిపాలెం జలాశయం నిర్మాణానికి శంకుస్థాపన చేయించారని గుర్తు చేశారు. 1979లో రెండు టిఎంసిల సామర్థ్యంతో ప్రాజెక్టు పూర్తయిందని, దాని ఫలితంగా 18వేల ఎకరాలు వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో ఆయకట్టు పారుదల రావడంతో పాటు 35 గ్రామాలకు తాగునీటి సమస్య కూడా తీరిందన్నారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిందని 2005లో గండిపాలెం ప్రాజెక్టుకు పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయంగా నామకరణం చేశారని తెలిపారు. ఎంతమంది ఎంఎలఎలున్నా ఒక్క చెంచురామయ్య మాత్రం ఉదయగిరి నియోజకవర్గ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో ప్రతిపక్ష నాయకులు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, బిసి నాయకులు అల్లూరి రాజు, మాజీ జెడ్‌పిటిసి కలివెల జ్యోతి, మండల కన్వీనర్ బయన్న, బొజ్జ నరసింహులు, మహిళ నాయకు రాలు అరుణమ్మ, కాశీరాం, సురేంద్ర నియోజవర్గ అన్ని మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రి ఆశయాల సాధనకు కృషి

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

తన తండ్రి చెంచురామయ్య ఆశయాల సాధనకు ఉదయగిరి నియోజకవర్గంలో టిడిపి గెలుపు అవసరమని మాజీ జెడ్‌పి చైర్మన్ టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి చెంచలబాబు యాదవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన తన తండ్రి 22వ వర్ధంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. మరణించిన వారిని తొందరగా మర్చిపోయే ఈ రోజుల్లో తన తండ్రి మరణించి 22 సంవత్సరాలు అవుతున్న ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు. గ్రామాల్లో నేటికీ ఆయన చేసిన సేవలను గుర్తించుకోవడం ఆయన చేసిన సేవలే నిదర్శనమన్నారు. ఇతర రాజకీయ పార్టీ నాయకులు కూడా శ్రద్ధాంజలి ఘటించారని, ఇలా రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీ నాయకులు తన తండ్రి చేసిన సేవల గొప్పతనమన్నారు. ఆనాడు మరికొందరు నాయకులతో పాటు తన తండ్రి ఉన్నత విలువల కోసం ప్రజలకు సేవలు అందించారన్నారు. మెట్టప్రాంత ప్రజల కోసం అసెంబ్లీలో రాజీనామాకు సిద్ధపడిన వ్యక్తి అని, గండిపాలెం జలాశయంకు శంకుస్థాపన కోసమే రాజీనామా సిద్ధపడ్డారన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా వస్తున్న టిడిపి ఉమ్మడి ఎంఎల్‌ఎ అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించుకొని ఈ ప్రాంత ప్రజలకు తనతండ్రి ఆశయాలను కొనసాగించేందుకు ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు. తన తండ్రిలా ప్రతి ఒక్కరికీ ఇప్పటికే అన్నంపెడుతూ అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న వ్యక్తి కాకర్ల సురేష్ అని తెలియజేశారు. కార్యక్రమంలో కాకర్ల సునీల్, మండల కన్వీనర్ బయన్న, మాజీ జెడ్‌పిటిసి కలివేల జ్యోతి, ప్రతిపక్ష నాయకులు గురువారెడ్డి, అల్లూరి రాజు రాజారెడ్డి, నియోజకవర్గ టిడిపి, బిజెపి, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రామిరెడ్డి ప్రచార యాత్ర

ప్రజాశక్తి-బిట్రగుంట

బోగోలు మండలం వైసిపి మండల కన్వీనర్ మద్దిబోయిన వీర రఘు ఆధ్వర్యంలో ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి బోగోలు సెంటర్ నుండి పంచాయతీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రతి వీధిలో ప్రతాప్‌కుమార్ రెడ్డికి మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలే తిరిగి ఆయన్ను సిఎం చేస్తాయని దేశంలో ఎక్కడా లేనివిధంగా వాళ్లకి వ్యవస్థను తీసుకువచ్చి ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను అందించిన ఏకైక సిఎం జగన్మోహన్ రెడ్డి అని తెలిపారు. జెడ్‌పిటిసి కీర్తన, మండల అధ్యక్షురాలు మేకల సుజాత, సర్పంచ్ అనిత, సీనియర్‌నాయకులు మేకల శ్రీను, ఎకె సుందర్ రాజ్, తోటపల్లి సాగర్, గండూరి శ్రీను, సాల్మన్ రాజ్, రాయి వినోద్‌యాదవ్, సురేష్ గౌడ్, పాపయ్య, నాయబ్ రసూల్, పర్రి అంకులయ్య, కంటేపల్లి కిష్టయ్య, తదితరులున్నారు.



మహిళా సాధికారతకు కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు మండలం పడకల్ల, బోటికర్ల పాడు, గండ్లవీడు, ఎర్రబల్లి గ్రామాలలో ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఎంపి విజయసాయి రెడ్డి కి మద్దతుగా రూరల్ వైసిపి నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. మహిళా సంక్షేమం, మహిళా సాధికారత కోసం సిఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇచ్చి మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా పురోగతి సాధిస్తున్న నేపథ్యంలో మహిళలు పెద్ద సంఖ్యలో సిఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలుస్తు, మళ్లీ జగన్ గెలుపు తమ సామాజిక ఆర్థిక వికాసానికి తోడ్పడుతుందని మహిళాలోకం భావిస్తోందని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా మహిళలు మళ్లీ జగన్, ముఖ్యమంత్రిగా గెలవాలని బలంగా కోరుకుంటున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు జెడ్‌పిటిసి ప్రసన్న లక్ష్మి, జెసిఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, వైస్ ఎంపిపి కంభంశెట్టి ప్రమీల, ఆత్మకూరు సిండికేట్ ఫార్మసీ సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సర్పంచులు సతీష్, వెంకటేశ్వర్లు, రూరల్ వైసిపి నాయకులు శ్రీనివాసులు రెడ్డి, దొరస్వామి నాయుడు, రమేష్, నాయబ్, ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.



వైసిపిలో 100 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల కేంద్రమైన అనంతసాగరంలోని సడ్డ నివాసంలో ఆత్మకూరు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో సడ్డ రవీంద్రారెడ్డి, రాపూరు సుందరరామిరెడ్డి అనుచరులు వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన నాయకులు సమిష్టిగా కృషి చేసి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అక్కలరెడ్డి అంకిరెడ్డి, సంపూర్ణమ్మ, శోభ, బట్రెడ్డి జనార్ధన్‌రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు, పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కలిగిరి : మేకపాటి కుటుంబంతోనే ఉదయగిరి నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల అధ్యక్షులు జయరామిరెడ్డి, కృష్ణారెడ్డిపాళెం టిడిపి సీనియర్ నాయకులు మాజీ టిడిపి మండల అధ్యక్షుడు, మాజీ కుడుములదిన్నెపాడు పిఎసిఎస్ అధ్యక్షులు చాగంటి జయరామిరెడ్డి టిడిపికి గుడ్ బై చెప్పారు. ఈ మేరకు శనివారం వారు బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో మాజీ ఎంపి మేకపాటి రాజమోహన్ రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. రానున్న రోజుల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాలూరి మాల్యాద్రి రెడ్డి, మండల కన్వీనర్ కాటం రవీందర్ రెడ్డి, ములకా శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను దెబ్బతీస్తే ఊరుకోం..

ప్రజాశక్తి-కావలి



నినాదాలు చేస్తున్న నాయకులు

అంబేద్కర్ ఆశయాలను దెబ్బతీసిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదలం అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్ మల్లి పేర్కొన్నారు. శనివారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీలో నిరసన తెలియజేశారు. దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14నుంచి మే 14వరకు గ్రామగ్రామాన జగనన్న పరిపాలనలో దళితులకు, గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని తెలియజేస్తామని తెలిపారు. సంక్షేమ పథకాల రద్దు, ఎస్‌సి ఎస్‌టి బిసి కార్పొరేషన్‌ల ఎత్తివేత, 27 సంక్షేమ పథకాల రద్దు వేల కోట్ల రూపాయిల కేంద్రం ఇస్తే నిదులను దారి మళ్లించడం, బటన్ నొక్కినా డబ్బులు పడక పోవడం, గ్రామీణ బడుగు వర్గాల మహిళలకు రూ.18500 ఇవ్వక పోవడం, అంబేద్కర్ జయంతిని 5 సంవత్సరాలుగా చేయక పోవడం విషయాలను తెలియజేస్తామని తెలిపారు. కస్తూరిభా కళాక్షేత్రంలో అంబేద్కర్ జయంతి రోజున 50 ట్రాక్టర్లు, వంద ఆటోలు, 25వరి కోత మిషన్‌లు ఇంకా బడుగు వర్గాలకు ఉపయోగపడే ఉపకరణాలు పంపిణీ చేసే వారు అని తెలిపారు. 1971వ సంవత్సరం నుండి 2019 వరకు కొనసాగిందన్నారు. జగనన్న వచ్చిన తర్వాత ఒక్క పథకం కూడా దళితులకు ఇవ్వలేదన్నారు. అంబేద్కర్‌కు నివాళులర్పించే అర్హత జగనన్నకు లేదన్నారు. అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రూ.10లక్షలు ఇచ్చే వారని తెలిపారు. కలెక్టర్ ద్వారా ఈ కార్యక్రమాలు జరిగేవి అన్నారు. కాని ఇప్పుడు కలెక్టర్ పూలమాల వేయడానికి కూడా డబ్బులు లేవంటున్నారని తెలియజేశారు. అంబేద్కర్ ఉత్సవాలను నిర్వహించరాదని కస్తూర్భా కళాక్షేత్రంలో బోర్డు పెట్టారన్నారు. దళిత, గిరిజనులను అణిచివేసిన ప్రభుత్వం ఇప్పటి వరకు చూడలేదన్నారు. దళిత గిరిజనులు సమావేశాలను పెట్టుకోనివ్వలేదన్నారు. దళితులకు, గిరిజనులకు జరిగిన అన్యాయం ప్రతి గడపగడపకు చెపుతామని తెలియజేశారు. కార్యక్రమంలో జరుగుమల్లి విజయరత్నం, గిరిజన నాయకుడు చౌటూరి వెంకటరత్నం, జెడ్డా వాసు, ముక్కు మోహన్‌రావు, కనకాల ఏడుకొండలు, తిరుపతి, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలోకి ముస్లిం సోదరులు

ప్రజాశక్తి-ఉదయగిరి



మండలంలోని వెంగళ రావు నగర్‌లో జగనన్న ప్రభుత్వానికి జై కొట్టిన టిడిపి ముస్లిమ్ సోదరులు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి సమక్షంలో శనివారం వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఇన్నిరోజులు టిడిపిలో ఉన్న ముస్లిం కుటుంబాలు మొత్తం వెంగళరావు నగర్‌లో షేక్ హనీఫ్ నివాసంలో టిడిపి నుండి వైసిపిలో చేరారు. వీరందరికీ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేకపాటి మాట్లాడుతూ బావను గెలిపించాలని తపనపడుతున్న పురందేశ్వరి ముస్లిములకు 4శాతం రిజర్వేషన్లు రద్దు చేస్తామనడం సబబు కాదన్నారు. పార్టీలో ఎస్‌కె.ఖాదర్ బాషా, హనీఫ్, ఉమర్, ఖాజా హుస్సేన్, అహ్మద్ బాషా తదితరులు కుటుంబాలు చేరాయని వారి కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మూలె పద్మజా వినయ్‌రెడ్డి, కన్వీనర్ సిఎం.ఓబుల్ రెడ్డి, జెడ్‌పిటిసి మోడీ రామాంజనేయులు, సర్పంచ్ తిరుపతయ్య, అక్కి భాస్కర్ రెడ్డి, సీతారామపురం మండలం నాయకులు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, పి సి అల్లూరు రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ పోటీ నుంచి తప్పుకోవాలి

ప్రజాశక్తి-కావలి



మాట్లాడుతున్న నాయకులు

కావలి నియోజక వర్గంలో భారీ అవినీతికి పాల్పడ్డ ఎంఎల్ఎ పోటీ నుంచి తప్పుకోవాలని కావలి టిడిపి, జనసేన నాయకులు డిమాండ్ చేశారు. శనివారం టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా మాజీ అధ్యక్షులు గుండ్లపల్లి భరత్ కుమార్ యాదవ్, జనసేన జిల్లా కార్యదర్శి సమ్మను వెంకటసుబ్బయ్య మాట్లాడారు. కావలి నియోజకవర్గంలో నిజాయితీ పరుడైన కావ్య క్రిష్ణారెడ్డి ఒకవైపు, భారీ అవినీతికి పాల్పడ్డ ఎంఎల్ఎ మరోవైపు పోటీ పడుతున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో ఎంఎల్ఎ తాను అవినీతి చేసి ఉంటే పోటీ నుంచి వైదొలుగుతానని సవాల్ విసిరాడని, ఆయన నియోజకవర్గంలో ఎంత పెద్దఎత్తున అవినీతికి పాల్పడ్డాడో ప్రజలే సాక్ష్యులని అన్నారు. కావలి పట్టణంలో అసలు అభివృద్ధి ఎక్కడ జరిగిందని ప్రశ్నించారు. 2019లో ఎంఎల్ఎ గెలిచినప్పటి నుంచి ఆయన విశ్వరూపం మొదలుపెట్టాడని, మహిళలపై, నాయకులపై దాడులు, అట్రాసిటీ కేసులు, అమృత్ పథకం పైలాన్ విధ్వంసాలు, ఎన్‌టిఆర్ విగ్రహం ధ్వంసం వంటి చర్యలు చేపట్టాడని మండిపడ్డారు. ప్రతిపక్షాలను నిర్వీర్యం చేయడానికి పరిమితమయ్యాడు తప్ప అభివృద్ధిని మరిచాడని విమర్శించారు. మరోసారి ఎంఎల్ఎ రామిరెడ్డికి ఓటేసి కావలిని సర్వనాశనం చేయొద్దని వారు కోరారు.

పేదల కోసం శ్రమిస్తా..

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



ప్రచారం చేపడుతున్న నల్లపరెడ్డి

పేదప్రజల కోసం ఎప్పుడూ శ్రమిస్తానని, వారికోసం తన ఇంటి తలుపులు తెరిచే ఉంటాయని కోవూరు నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కుడితిపాలెం గ్రామంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుడితిపాలెం గ్రామస్తులు మేళతాళాల నడుమ ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేసి ప్రజలను సోమరిపోతులు చేస్తున్నారని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి మాట్లాడడం సరికాదన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఐదేళ్లు అధికారం అనుభవించి జగన్మోహన్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. గ్రామాలను పట్టణాలుగా మారుస్తానని ప్రశాంతిరెడ్డి అనడం వ్యంగ్యంగా ఉందన్నారు. అనంతరం ప్రసన్నకుమార్ రెడ్డి సోదరుడు నల్లపరెడ్డి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు పార్టీ కోసం కష్టపడిన దినేష్‌రెడ్డికి సీటు ఇవ్వకుండా చంద్రబాబు నాయుడు తడి గుడ్డతో దినేష్ రెడ్డి గొంతుకోసాడన్నారు. ప్రశాంతి రెడ్డిని కోవూరు ప్రజలు ఎవరు నమ్మరని తెలిపారు. ఏడోసారి కోవూరు ఎంఎల్ఎగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఎన్నిక కాబోతున్నారన్నారు. కార్యక్రమంలో జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, జెడ్‌పి వైస్‌చైర్మన్ శ్రీహరి కోట జయలక్ష్మి, కుడితిపాలెం వైసిపి నాయకులు వెంకటరామిరెడ్డి, నాయుడు సురేష్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

90శాతం వలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సచివాలయం వలంటీర్లు 90శాతం రాజీనామాలు చేసినట్లు మండల సచివాలయ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాలంటీర్లు తమ పదవులకు రాజీనామా చేయడంతో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరిస్తారన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో రాగానే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సంతకం గ్రామ సచివాలయ వలంటీర్లను మళ్లీ విధి నిర్వహణలో తీసుకుంటారన్నారు. వలంటీర్లు రాజీనామా చేయడంతో ప్రతిపక్ష నాయకుల్లో అలజడులు మొదలయ్యాయన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలోని విరువూరు గ్రామంలో టిడిపి అభ్యర్థి కాకర్ల సురేష్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం చంద్ర వెంకయ్య, చంద్ర ఉమామహేశ్వరరావు ప్రతి ఇంటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆరు పథకాలను డోర్ టు డోర్ తిరిగి వివరించి నియోజకవర్గంలో అభివృద్ధి చెందాలంటే ఒక తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికలలో టిడిపి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పాలకొల్లు విజయభాస్కర్ రెడ్డి, మాలెం రఘురాంరెడ్డి, మావిలపల్లి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రూ.5వేలు అందజేత

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం పరిసర ప్రాంతమైన బుడంగుంట గిరిజన కాలనీలో నిరుపేద గిరిజన వృద్ధురాలు శనివారం పాలకీర్తి బుజ్జమ్మ (70)అకాల మరణం చెందడంతో ఆమె అంత్య క్రియలు నిర్వహించేందుకు సంయుక్త సేవాసంస్థ ద్వారా ఆ సంస్థ సభ్యులు ఒట్టూరు.శ్రీనివాసులు, జ్యోతి, శాంతి వర్ధన్, కె.శ్రీనివాసరావు, తన్నీరు.రవి కుమార్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ద్వారా మృతురాలి కుమార్తెకు రూ.5వేలు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర మాట్లాడుతూ నిరుపేద వృద్ధురాలు బుజ్జమ్మ అకాల మరణం చెందడంతో ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు ఎవరూ లేరని సంయుక్త సేవాసంస్థ ద్వారా ఆదుకోవాలని ఆమె చుట్టుపక్కల వారు తెలియజేశారన్నారు.

'పసుపులేటి'కి మద్దతు..

ప్రజాశక్తి-కావలి



పార్టీలోకి ఆహ్వానించిన పసుపులేటి సతీమణి

కావలి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌ను బలపరుస్తూ శనివారం 33వ వార్డుకు చెందిన జనసేన నేతలు పిఎస్ఆర్ పార్టీలో చేరారు. పసుపులేటి సుగుణమ్మ వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నిస్వార్థంగా రాజకీయాల్లోకి వచ్చి నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న పసుపులేటి దంపతులకు తమ మద్దతు ఉంటుందని, పార్టీలకు అతీతంగా కచ్చితంగా స్వతంత్ర అభ్యర్థి పసుపులేటి సుధాకర్‌ను గెలిపించుకు తీరుతామని వారు తెలిపారు.

జనసేన నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-కావలి



జనసేన కావలి అధికార ప్రతినిధి మన్నెపల్లి రిషికేశ్ తండ్రి డాక్టర్ మన్నేపల్లి హరిప్రసాద్‌కు ఇటీవల బ్రెయిన్‌లో బ్లడ్ క్లాట్ అయి, నెల్లూరు హాస్పటల్‌లో చికిత్స చేయించి శనివారం కావలిలో వారి ఇంటికి తీసుకువచ్చారు. వారిని కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ జనసేన నాయకులు, కార్యకర్తలతో వెళ్లి వారి ఆరోగ్య విషయమై విచారించి, వారు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. జనసేన నాయకులు ఆలా శ్రీనాథ్, గుడిపల్లి వెంకయ్య, బెల్లంకొండ మస్తాన్, ఐటి బాలు, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

చౌకచర్లలో వైసిపికి షాక్

ప్రజాశక్తి-విడవలూరు

మండలం చౌక చర్ల గ్రామంలో వైసిపి నాయకుడు మురళి రెడ్డి ముఖ్య అనుచరులు టిడిపిలో చేరారు. గ్రామానికి చెందిన చిన్నరాగయ్య, వార్డు నెంబరు విజయమ్మ, తుపిలి శ్రీహరి లతోపాటు సుమారు వందమంది వేమి రెడ్డి ప్రశాంత్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వైసీపీ కంచుకోటగా ఉన్న బీసీలు టిడిపిలో చేరడంతో వైసిపి గ్రామంలో కనుమరుగైందని ఓటర్లు భావిస్తున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో చౌక చర్ల గ్రామంలో టిడిపికి భారీ మెజార్టీ వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తు న్నారు.



దర్గాలో పూజలు

ప్రజాశక్తి-వెంకటాచలం

కసుమూరు ప్రముఖ పుణ్యక్షేత్రమైన మస్తాన్ వలి దర్గాలో సోమిరెడ్డి సింధూ రెడ్డి తండ్రి కోసం ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ఆమె కసుమూ రులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిం చారు. సోమిరెడ్డి చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిం చారు. కార్యక్రమంలో రాజా యాదవ్, రాధాకృష్ణ నాయుడు, వెంకయ్య నాయుడు, ప్రభాకర్ నాయుడు, మస్తాన్, వెంకటాద్రి తదితరులున్నారు.

ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి-వెంకటాచలం

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే వ్యక్తి మావయ్య సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి అండగా నిలబడి ఓటు వేసి గెలిపించాలని సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి సోమిరెడ్డి శృతి రెడ్డి కోరారు. వెంకటాచలం పంచాయతీలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మద్దతుగా ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.అనంతరం నాగూర్ మీరయ్య నిషాన్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో నాగేంద్ర ప్రసాద్, కుంచి శ్రీనివాసులు, ధనుంజయ నాయుడు, మునుస్వామి మోహనయ్య, ఖయ్యూం ఖాన్, జుంజు రవి, సిరాజ్, రఘురామయ్య, మనీ, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శిక్షణ తరగతులు పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

ఎన్నికల శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని , వివిధ అంశాలపై విషయ పరిజ్ఞానం పెంచుకోవాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ 117 నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, సూచించారు. పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులు, సెక్టర్ అధికారులకు స్థానిక డి.కె. మహిళా కళాశాలలో రెండవ విడత ఎన్నికల శిక్షణలో భాగంగా శనివారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.ఒ. మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషన్ వారి ఆదేశాల మేరకు, జిల్లా ఎన్నికల అధికారి సూచనల మేరకు శనివారం, సోమవారాల్లో శిక్షణ తరగతులను నిర్వహించి పి.ఓ, ఏ.పి.ఓ.ల విధి విధానాల గురించి క్షుణ్ణంగా వివరిస్తామని శిక్షణలో అన్ని అంశాల పట్ల ఉత్తమ తర్ఫీదును ఇచ్చి, సందేహాలకు తావులేకుండా వివరించాలని మాస్టర్ ట్రైనర్స్‌కు సూచించారు. శిక్షణలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో మెటీరీయల్ పరిశీలించుకోవడం, మెటీరీయల్ స్వాధీనం పొందాక పోలింగ్ కేంద్రాలకు తరలించడం, మార్క్ పోల్ విధానం, ఈ.వి.ఎంల సీలింగ్ విధానం, ప్రతికూల పరిస్థితుల్లో ఈ.వి.ఎంల రీ ప్లేస్ మెంట్, వి.వి ప్యాట్ల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల్లో డిస్ప్లే బోర్డులు, హౌస్ ఆఫ్ పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం శిక్షణలో పొందిన పరిజ్ఞానాన్ని పరిశీలించేందుకు ఎన్నికల అధికారులకు నమూనా పరీక్షను నిర్వహించారు.ఈ శిక్షణలో నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద, టి.పి. ఆర్.ఓ. ప్రసాద్, మేనేజర్ ఇనాయతుల్లా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

ముస్లిం, మైనార్టీల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

టీడీపీ ప్రభుత్వంలోనే ముస్లిం, మైనార్టీలకు రక్షణతో పాటు భద్రత ఉంటుందని.. వారి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తు ందని మాజీ మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పేర్కొన్నారు. నెల్లూరు నగరం 48వ డివిజన్ మీరా మొహిద్దిన్ దర్గా కోటమిట్ట పలు ప్రాంతాలలో ఎంపి, ఎంఎల్ఎ అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పొంగూరు నారాయణలకు మద్దతుగా ఆమె శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.అనంతరం రమాదేవి మీడియాతో మాట్లాడుతూ ఈ డివిజన్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు అనేక సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలో పేదల కడుపు నింపేందుకు అన్న క్యాంటీన్ పెట్టి ఐదు రూపాయలకు చక్కటి భోజనం అందించారని, చంద్రన్న బీమా ద్వారా చనిపోయిన ప్రతి పేద కుటుంబానికీ రెండు లక్షల రూపాయలు బీమా అందించారన్నారు. ముస్లిములకు దుల్హన్ పథకం, రంజాన్ తోఫా, ఇలా ఎన్నో సంక్షేమ పథకాలను చేపట్టారన్నారు.నేడు ఈ వైసిపి ప్రభుత్వం ఈ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసిందని ప్రజలే తమకు తెలుపుతున్నారని తమ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ అలాగే మరెన్నో సంక్షేమ పథకాలు అందించబోతున్నామన్నారు. ఈ సందర్భంగా తెలిపారు.తెలుగుదేశం పార్టీ తరపున నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా పోటీచేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు నగర శాసనసభ్యులుగా పోటీచేస్తున్న పొంగూరు నారాయణను మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అమూల్యమైన ఓటు వేసి ఆశీర్వదించాలని అభ్యర్థించారు



ప్రచారం చేస్తున్న దృశ్యం

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం..

ప్రజాశక్తి-సీతారామపురం

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని చేసుకుందామని రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిసి అల్లూరు రాజు ప్రజలను కోరారు. శనివారం సీతారామపురం మండలంలోని నారాయణమ్మపేట, పండ్రంగి గ్రామాలలో పర్యటించి గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తామందరం తోడుగా ఉండి అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని, అదేవిధంగా ఉదయగిరి ఎంఎల్ ఎగా మేకపాటి రాజగోపాల్ రెడ్డిని, ఎంపిగా వేణుంబాక విజయసాయిరెడ్డిలను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఉపాధి హామీ కూలీలు ముక్త కంఠంతో తెలియజశారు. రాబోయే ఎన్నికలలో వైసిపి అభ్యర్థులను గెలిపించాలని పిసి.అల్లూరు రాజు ఉపాధి కూలీలను కోరారు. కార్యక్రమ ంలో స్థానిక వైసిపి నాయకులు కటారి శ్రీనివాసులు, ఏనుగుల రూపేష్, టీ కొట్టు రమణయ్య, షేక్ భాషా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అల్లూరు రాజు

నేడు సాగరంలో 'సిద్ధం సభ'

ప్రజాశక్తి-అనంతసాగరం

మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు మేమంతా సిద్ధం సభ జరుగునున్నట్లు శనివారం మండల సచివాలయ కోఆర్డినేటర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి తెలిపారు. మేమంతా సిద్ధం సభకు ఆత్మకూరు నియోజకవర్గ వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి మేకపాటి విక్రమ్ రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి, అనంతసాగరం మండల జెడ్‌పిటిసి రాపూరు వెంకటసుబ్బారెడ్డి, జిల్లా వైసిపి సీనియర్ నాయకులు ఊరిబిండి ప్రభాకర్ రెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు. మండలంలోని మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, వార్డ్ మెంబర్లు, వైసిపి అనుబంధ సంస్థ ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.



ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పి.నారాయణ

వైసిపికి చివరి ఎన్నికలు

ప్రజాశక్తి-నెల్లూరు సిటీ

మే 13వతేదే...వైసీపీకి చివరి ఎన్నికలని రాష్ట్రం నుంచి ఈ ప్రభుత్వానికి తరిమికొట్టేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని...మాజీ మంత్రి, నెల్లూరుసిటీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ ఎద్దేవా చేశారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నెల్లూరు నగరం 4వ డివిజన్‌లో అధ్యక్షుడు మామిడాల మధుతో కలిసి ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఇంటింటికెళ్లి...టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేస్తూ...తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. ప్రజలందరూ ఆలోచించి...మే 13న జరిగే ఎన్నికల్లో... సైకిల్ గుర్తుపై రెండు ఓట్లేసి...ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకి విజ్ఞప్తి చేశారు.

అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల స్పందన అనూహ్యంగా ఉందని...దానికి కారణం...2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి అన్నారు. ఈ డివిజన్‌లో అధిక శాతం నిరుపేదలు జీవిస్తున్నారనీ, ప్రచారంలో పలువురు అప్పుడు డబ్బులు కట్టాం..మాకు ఇప్పటి వరకు ఇల్లు రాలేదని తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. గత ఐదేళ్లుగా నిరుపేదలకు ఇల్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు.

ప్రభుత్వాలు మారినా...ప్రజలు మాత్రం ఇబ్బంది పడకూడదన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రజలపై చెత్త పన్నులు వేశారని...కరెంటు ఛార్జీలు పెంచేశారన్నారు. టీడీపీ హయాంలో ఒక్క సారిగా కూడా మున్సిపల్ ట్యాక్స్‌లు పెంచలేదని గుర్తు చేశారు. భారతదేశంలోనే నెల్లూరుని నెం. 1 మోడల్ సిటీగా చేసి చూపిస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి హయాంలో బిసిలపై దాడులు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

వైసిపి ప్రభుత్యంలో బిసిలపై దాడులు ఎక్కువ జరిగాయని బిసి నేత మారుబోయిన జనార్దన్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం ఇందుకూరుపేట మండలం కొరూటురు గ్రామంలో టిడిపి మండల అధ్యక్షులు రావెళ్ళ వీరేంద్ర చౌదరి ఆధ్వర్యంలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు బిసిలు వైసిపి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న సమస్యలు ప్రస్తావించారు.

అనంతరం వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో బిసిలకు ఎటువంటి న్యాయం జరగలేదన్నారు. బిసి కార్పొరేషన్ల నిధులు పక్కదోవ మళ్లించినట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో బిసిలపై అక్రమ కేసులు దాడులు పెరిగాయన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బిసిలకు రక్షణ చట్టం తెచ్చిందన్నారు. బిసిలందరూ ఐక్యంగా ఉండి ఎంపిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని, ఎంఎల్ఎగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి గంపల అనిల్, మండల బిసిసెల్ అధ్యక్షులు బండ్ల మల్లికార్జున గౌడ్, మారుబోయిన జనార్దన్ గౌడ్, మండల యువత ప్రధాన కార్యదర్శి సింధూర కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరికలు

ప్రజాశక్తి-అనంతసాగరం

: మండలంలోని పాతదేవరాయపల్లి పంచాయతీలోని ముత్తుకూరు గ్రామం నుండి పెద్దఎత్తున వైసిపి మునమాల రమణారెడ్డి, ఏండ్ల నరసమ్మ, శ్రీనివాసులు తోపాటు 50 కుటుంబాలు ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు.

ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఒక ఉమ్మడి ప్రణాళికతో అందరం తెలుగుదేశం పార్టీ విజయానికి కలిసి పని చేద్దాం అని ఆహ్వానించారు.

కండువా మార్చిన 'పువ్వాడి'

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణానికి చెందిన పువ్వాడి రమణయ్య మరోసారి వైసిపి కండువా కప్పించుకున్నారు. రమణయ్య కొద్దెనెలల కిందట వైసిపికి గుడ్ బై చెప్పి తెలుగుదేశం పార్టీలో చేరారు. మళ్లీ శనివారం ఆయన నెల్లూరు పార్లమెంట్ వైసిపి అభ్యర్థి విజయసాయిరెడ్డి చేత వైసిపి కండువా కప్పించుకున్నాడు. గతంలో ఈయన వైసిపిలో ఉంటూ శాసన సభ్యులు మానుగుంట మహేందర్ రెడ్డి కి వ్యతిరేకంగా కొనసాగుతూ వచ్చారు. ఎంఎల్‌సి తూమాటి మాధవరావు వర్గంలో కొనసాగారు. ఆ తర్వాత మాధవరావుకి దూరమై మళ్లీ మహీధర్ రెడ్డి వద్దకి చేరారు. ఏమైందో ఏమో కానీ మళ్లీ మహీధర్ రెడ్డి కి దూరమై ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వచ్చారు. చంద్రబాబు నాయుడు అరెస్టు అయి జైల్లో ఉన్న సందర్భంలో టిడిపి కండువాను పువ్వాడి రమణయ్య కప్పుకున్నారు. తిరిగి వైసిపి కండువా కప్పుకోవడంతో ఆయన గురించి జనాలు విచిత్రంగా చెప్పుకోవడం కనిపించింది.



పువ్వాడికి వైసిపి కండువా కప్పుతున్న విజయసాయిరెడ్డి



తనిఖీలు ముమ్మరం

ప్రజాశక్తి -నెల్లూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దులు, ఇతర ప్రధాన మార్గాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. శనివారం వెంకటాచలం సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన స్టాటిటికల్ సర్వయివల్ టీం చెక్‌పోస్టును కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాత్రివేళల్లో కూడా తనిఖీలను ముమ్మరంగా చేపట్టాలని, ముఖ్యంగా ట్రాన్స్‌పోర్టు వాహనాలను, లారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఎస్-ఎస్‌టి టీమ్ లీడర్ కళారాణిని ఆదేశించారు. ఆర్‌టిసి బస్సులను కూడా తనిఖీ చేయాలన్నారు. ఎటువంటి అనుమతి లేకుండా రవాణా చేసే పార్శిళ్లను తనిఖీ చేసి సీజ్ చేయాలన్నారు. ప్రతి పార్శిల్‌కు బిల్లులను సరిచూడాలన్నారు. కలెక్టర్ వెంట డిఎస్పీ వీరాంజనేయరెడ్డి, సిఐ అంకమరావు ఉన్నారు.

కందుకూరు, నెల్లూరు రూపురేఖలు మారుస్తాం..

వైసిపి ఎంపి అభ్యర్థి విజయసాయిరెడ్డి

కప్రజాశక్తి-కందుకూరు

రానున్న ఐదేళ్లలో కందుకూరు నియోజకవర్గం తో పాటు నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల రూపురేఖలు మారుస్తామని, ప్రజలకు అత్యంత ప్రయోజనం చేకూరేలా అభివృద్ధి చేసి చూపిస్తామని వైసిపి నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. పార్టీ కందుకూరు ఎంఎల్ఎ అభ్యర్థి బుర్రా ముధుసూధన్ యాదవ్, పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌తో కలిసి శనివారం కందుకూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత మూడు రోజులుగా కందుకూరు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన తాము ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన గుర్తించామన్నారు. కందుకూరు పట్టణానికి ఉత్తరాన 70 కోట్ల అంచనా వ్యయంతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి తప్పక కషి చేస్తానన్నారు. రాళ్లపాడు ఎడమ కాలువ నలదాపూర్ వరకు రూ.50 కోట్ల అంచనా వ్యయంతో విస్తరణకు కషి చేస్తామని అన్నారు. కందుకూరు-తెట్టు మధ్య కేజీటీ రోడ్డులో మానెట్టిపై రూ.18 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్

ప్రజల సమస్యల నేరుగా తెలుసుకొని వాటిని పరిష్కరించేందుకు కందుకూరులో ప్రజాదర్బాన్ నిర్వహిస్తామని విజయసాయి రెడ్డి తెలిపారు. యువత కోసం ప్రతి ఆరు నెలలకోసారి జాబ్ మేళాలు నిర్వహిస్తామని, ప్రముఖ కంపెనీలను రప్పించి యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామన్నారు. ఎంఎల్ఎ అభ్యర్థి బుర్రా ముధుసూధర్ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన లభిస్తోందని, ప్రజలు అన్ని పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేపట్టిన సామాజిక న్యాయంలో భాగంగా కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం బీసీ వర్గానికి కేటాయించారన్నారు. చట్టసభల్లో బలహీన వర్గాల గొంతు వినిపించాలన్నదే జగన్మోహన్ రెడ్డి ఉద్దేశమని అన్నారు.

టిడిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు పట్టణంలోని 18వ వార్డు మోహన్ థియేటర్ వెనుక ప్రాంతంలో శనివారం టిడిపి కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఇంటింటి ప్రచారం చేశారు. . కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపటం వల్ల ఎంతో నష్టం జరిగిందని స్థానిక యువకులు ఆవేదన వ్యక్తం చేయగా రాబోయే కూటమి ప్రభుత్వంలో కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలవటం ఖాయమని తెలిపారు. , చంద్రబాబు అదే విషయంపై హామీ ఇచ్చారని సౌజన్య గుర్తు చేశారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంపి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి , ఎంఎల్ఎ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుకి మద్దతు ఇచ్చి గెలిపించాలని సౌజన్య కోరారు. కరపత్రాలు పంచారు. ప్రచారంలో వార్డు అధ్యక్షుడు నగర జయకష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీనివాసులు, పట్టణ మహిళా కమిటీ అధ్యక్షురాలు ముచ్చు లక్ష్మీరాజ్యం, నియోజకవర్గ ఐటిడిపి అధ్యక్షుడు షేక్ మున్నా, స్థానిక నాయకులు షేక్ అబ్దుల్ ఫాజిల్, షేక్ బాబు, షేక్ రాహుల్, నాగరాజు సింగ్, సంగా పాండురంగారావు ఉన్నారు.



ఇటుకబట్టీల వ్యాపారులు మద్దతు

హైదరాబాద్ లో స్థిరపడ్డ కందుకూరు నియోజకవర్గానికి చెందిన ఇటుక బట్టీల వ్యాపారులు కందుకూరు నియోజకవర్గ టిడిపి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఇంటూరి నాగేశ్వరరావుకిమద్దతు తెలిపారు. శనివారం వ్యాపారులంతా నాగేశ్వరరా వుని, హైదరాబాద్ లోని దుండిగల్ ప్రాంతానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించి, తమ మద్దతు ప్రకటించారు. వలేటివారిపాలెం మండలంలోని వలేటివారిపాలెం, కూనిపాలెం, రామచంద్రాపురం, పోకూరు శాఖవరం, కలవళ్ల తో పాటు లింగస ముద్రం మండలం తిమ్మారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పలువురు ముఖ్యులు ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 17వ డివిజన్ పరిధిలోని మధురానగర్ ప్రాంతానికి చెందిన యాకసిరి మహిత ఇంటర్ మొదటి సంవత్సర సిఈసి గ్రూప్ విద్యనభ్యసిస్తుంది. శుక్రవారం ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. ఈ ఫలితాల్లో సిఈసి గ్రూప్‌లో 500 మార్కులకు 485 మార్కులు సాధించి జిల్లాలో టాపర్‌గా నిలిచింది. విషయం తెలుసుకున్న ఆ డివిజన్ సిపిఎం శాఖ కార్యదర్శి కట్టా సతీష్ , కమిటీ సభ్యులు యాకసిరి మహిత ఇంటికి చేరుకుని అభినందించారు.

ప్రచార హోరు..!

వీక్షణం

ప్రజాశక్తి-నెల్లూరు :కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి ఎన్నికల బరిలో నిలుస్తున్న అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకొనేందుకు తమ శక్తి మేరకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్న తరుణంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార పార్టీ నుంచి ప్రతితపక్ష పార్టీలోకి చేరే వారు.. ప్రతిపక్ష పార్టీ నుంచి అధికార పార్టీలోకి వెళ్లేవారితో ఆయా పార్టీ కార్యాలయాలు కళకళ లాడుతున్నాయి.ఎన్నికల సమయంలో ఎటువంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా నియంత్రించేందుకు ఓటర్లకు రక్షణ కల్పించేందుకు, ప్రశాంత వాతావరణానికి ఎటువంటి భంగం కలగకుండా ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర బలగాలు జిల్లాకు చేరుకున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ప్రతినిత్యం సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసేందుకు రాజకీయ పార్టీలు చేసే ప్రయ త్నాలను భగ్నం చేసేందుకు తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి నిత్యం ద్విచక్రవాహనాల నుంచి భారీ వాహనాలన్నింటినీ తనిఖీ చేస్తున్నారు. పోలీసు తనిఖీల్లో మద్యం బాటిళ్లను సీజ్ చేయడంతోపాటు ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును లక్షల్లో స్వాధీనం చేసుకొని ట్రెజరీ విభాగానికి అందజేస్తున్నారు. నగర నియోజకవర్గం అసెంబ్లీ స్థానానికి పోటీ చేసే సిపిఎం అభ్యర్థి పేరు రాష్ట్ర కమిటీ ప్రకటించింది. సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్‌ను అభ్యర్థిగా పేరు ఖారురు చేసి ప్రకటించడంతో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నగరానికి చేరుకోని ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. సిపిఎంకు మంచి పట్టు ఉన్న డివిజన్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మార్చిలో జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో 24,620 మందికి విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 17,100 మంది ఉత్తీర్ణులయ్యారు. 69 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 8వ స్థానంలో నిలిచింది. రెండో సంవత్సరం రాష్ట్రంలో ఉత్తీర్ణతా శాతం 78 కాగా, జిల్లాలో 21,293 మందికి గాను, 17,292 మంది ఉత్తీర్ణులై 81 ఉత్తీర్ణతా శాతంతో రాష్ట్రంలో జిల్లా 6 వ స్థానంలో నిలిచింది. ఒకేషనల్ విద్యార్థులు మొదటి సంవత్సరంలో 64 శాతం , రెండవ సంవత్సరంలో 72 శాతం ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి : కలెక్టర్



నెల్లూరులో...

ప్రజాశక్తి-నెల్లూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13వ తేదీన జిల్లాలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ ప్రాంగణంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోదాంను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో ఈనెల18వ తేదీన ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసామన్నారు. ఆ రోజు నుంచి నామినేషన్లు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఈనెల 29వ తేదీ నాటికి ఎన్నికల్లో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజ కవర్గాలకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ర్యాండమై జేషన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేసినట్లు తెలిపారు.

ప్రజాశక్తి-కందుకూరు :సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మే 13న జిల్లాలో ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం కందుకూరులోని టీ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటర్ సెల్ఫీ బూత్ ను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈనెల18వ తేదీన ఎన్నికలకు గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల18వ తేదీ నుండి నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈనెల 29వ తేదీ నాటికి ఎన్నికల్లో నిలిచే అభ్యర్థుల జాబితాలు ప్రకటించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు అవసరమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ర్యాండమైజేషన్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేయడం జరిగిందన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల ర్యాండమైజేషన్ చేసిన విధంగా ఇ.వి.ఎం.లను ఈరోజు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అప్పగించడం జరుగు తుందన్నారు. కందుకూరు, కావలి నియోజ కవర్గాలకు సంబంధించిన .పీ.ఓలు మరియుఏ.పి. ఓలకు ఎన్నికలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. మరో విడత ఈనెల 15వ తేదీన పి.ఓలకు మరియు ఎ.పీ.ఓలకు ఎన్నికలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ కందుకూరు నియోజకవర్గ పరిధిలోని జాతీయ రహదారి తెట్టు వద్ద స్టాటికల్ సర్వేలెన్స్ టీమ్ చెక్ పోస్ట్ ను తనిఖీ చేశారు. కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ఉన్నారు.



కందుకూరులో..